# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక


అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1

సంపుటి : 14 సంచిక : 365 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 24-12-2025 పేజీలు : 12 వెల రూ.3/




# క్వాంటమ్‌తో భవిత బంగారం

అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ కేంద్రాన్ని స్థాపించడంతో పాటు వచ్చే రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్ తయారు చేసే స్థాయికి ఎదుగుతాం. ప్రపంచానికి మనం క్వాంటమ్ కంప్యూటర్లను సరఫరా చేయగలం. లక్ష మంది క్వాంటమ్ కంప్యూటింగ్ నిపుణులను తయారు చేయడమే అమరావతి క్వాంటమ్ వ్యాలీ లక్ష్యం

అమరావతి నాలెడ్జ్ ఎకానమీ, క్వాంటమ్ వ్యాలీగా ఉంటుంది. తిరుపతి స్పేస్ సిటీగా ఉంటుంది. అనంతపురం, కడప వంటి ప్రాంతాలు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్ క్లస్టర్‌గా మారబోతున్నాయి. విశాఖ-చెన్నై, బెంగళూరు-హైదరాబాద్, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు రానున్నాయి. - సీఎం చంద్రబాబు

- కొత్త ఆవిష్కరణను అందించే పూచీ నాది: చంద్రబాబు
- అందిపుచ్చుకునే బాధ్యత విద్యార్థులు, యువతది
- ఏడేళ్లు కష్టపడితే భవిష్యత్తుకు తిరుగుండదు
- లక్ష మంది క్వాంటమ్ నిపుణుల తయారీనే అమరావతి క్వాంటమ్ వ్యాలీ లక్ష్యం
- ఇరవై ఏళ్ల భవిష్యత్‌కు ఇప్పటి నుంచే కార్యాచరణ
- నాడు సిలికాన్ వ్యాలీ.. నేడు క్వాంటమ్ వ్యాలీ
- రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను తయారుచేస్తాం
- 'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమంలో సీఎం
- 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థుల హాజరు

2

- కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ నేతకు కీలక పదవి
- సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల రవీంద్ర కుమార్
- మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న మాజీ ఎంపీ
- నియామకాన్ని ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించనున్న కనకమేడల
- టీడీపీ-ఎన్డీఏ సంబంధాల్లో కీలక పరిణామంగా విశ్లేషణ

# సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల...

వివరాలు 2 లో..

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ



- ఏవోబీ సరిహద్దుల్లో లొంగిపోయిన 22 మంది మావోలు
- లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు
- లొంగిపోయిన మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు

2



## కొండపై కల్తీకి కట్టడి

- ఫలిస్తున్న టీటీడీ కఠిన చర్యలు
- సరఫరాలైనా, భక్తులు ఇచ్చినవైనా..శాంపిల్ ల్యాబ్‌కు పంపి నిర్ధారణ
- తేడా అనిపిస్తే నిర్దాక్షిణ్యంగా తిరస్కృతి
- దీంతో మెరుగుపడిన నెయ్యి నాణ్యత
- పాతిక లారీల జీడిపప్పు వెనక్కి.
- ప్రసాదాలపై ఆగిన ఫిర్యాదులు సర్కార్ 'ప్రక్షాళన'పై భక్తుల్లో సంతృప్తి

వివరాలు 2 లో..

## వ్యక్తిగత ఇష్టాయిష్టాలను సహించం : సీఎం రేవంత్



- సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలి
- బాగా పనిచేస్తే గౌరవిస్తాం.. లేకపోతే ఎంత పెద్ద హోదాలో ఉన్నా ఊరుకోం
- పనితీరులో మార్పు రాకపోయినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలే

2

# రికార్డుపై బాహుబలి గురి!


బ్లూబర్డ్ బ్లాక్-2 ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో.. నేడే ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ ప్రయోగం అమెరికాలోని ఏఎస్‌టీ స్పేస్ సంస్థకు చెందిన 6,400 కిలోల భారీ ఉపగ్రహంతో నింగిలోకి ఇంతటి భారీ ఉపగ్రహ ప్రయోగం ఇస్రోకిదే తొలిసారి



వివరాలు 2 లో..

## గుర్తు తెలియని వాహనం ఢీకొని... శిరిగిరిపాడు సమీపంలో దావుపల్లి వద్ద పెద్దపులి మృతి

ఐ ఎన్ బి టైమ్స్, వెల్దుర్తి మండల ప్రతినిధి, డిసెంబర్ 23



పల్నాడు జిల్లా లోని వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు వద్ద అటవీశాఖ చెక్ పోస్ట్ సమీపంలోని దావుపల్లి వద్ద మంగళవారం ఉదయం 6,7గంటల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని పెద్దపులి మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకొని పెద్ద పులి మృతి పై విచారణ చేపట్టారు.

# క్వాంటమ్‌తో భవిత బంగారం

**అమరావతి, డిసెంబరు 23**

గ్లోబల్ టెక్నాలజీని రాష్ట్రానికి పరిచయం చేస్తానని, దానిని అందిపుచ్చుకుని బంగారు భవిష్యత్తును సృష్టించుకోవాలని విద్యార్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ.. ఇప్పుడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఆధునిక సాంకేతిక నైపుణ్య దిశానిర్దేశాలని చెప్పారు. విద్యార్థులు ఏడేళ్ల పాటు క్వాంటమ్ కంప్యూటింగ్‌లో నిష్ణాతులైతే.. భవిష్యత్తు అంతా బంగారమేనని, కోరుకున్నవి అన్నీ దక్కుతాయని కర్తవ్యబోధ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆధారంగా క్వాంటమ్ కంప్యూటింగ్ నైపుణ్యంతో ఎవరైనా నోబెల్ బహుమతిని సాధిస్తే వారికి రూ.100 కోట్లు నజరానా ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అమరావతి వేదికగా మంగళవారం పలు ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన 50,000 మందికిపైగా టెక్ విద్యార్థులతో "క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్" కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సహా వివిధ ఆధునిక సాంకేతికతలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. "యువత రేపటి గురించి ఆలోచిస్తే.. నేను 20 ఏళ్ల ముందుకు ఆలోచిస్తాను. అందులో భాగమే అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో సహా పునరుత్పాదక విద్యుత్తు, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో కొత్త అవిష్కరణను అందించే పూచీ నాది. దానిని అందుకునే బాధ్యత విద్యార్థులు, యువతదే. ఆరునెలల్లోనే క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ భవనాన్ని నిర్మించాలని సీఆర్‌డీఏ సమావేశంలో దిశానిర్దేశం చేశాం. అమరావతి క్వాంటమ్‌వ్యాలీని అద్భుతంగా నిర్మిస్తున్నాం. గత నెల 13వ తేదీన క్వాంటమ్ కంప్యూటర్‌పై నేను చేసిన ప్రకటన ఎందరిలోనో విశ్వాసాన్ని పెంచింది. ఏపీ స్పీడ్ లెర్నర్. క్వాంటమ్ కంప్యూటింగ్ కంటే ఆంధ్రపదేశ్ స్పీడ్‌గా పరుగులు తీస్తోంది.

### భారతీయుల డీఎన్ఏలోనే విజ్ఞానం

విజ్ఞానం భారతీయుల డీఎన్ఏలోనే ఉంది. క్రీస్తు పూర్వం 2500లోనే పట్టణ ప్రణాళికలు రచించారు. భారత్‌కు బంగారు పిచ్చుక అనే పేరుంది. గణితంలో భారతీయులు చురుగ్గా ఉంటారు. 2000 ఏళ్ల కిందటే ప్రపంచ జీడీపీలో 40శాతం భారత్. ఇప్పుడు జీడీపీలో ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నాం. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వంలో 2047 నాటికి కచ్చితంగా మొదటి స్థానంలో ఉంటాం. వికసిత్ భారత్ దిశగా దేశం వేగంగా అడుగులు వేస్తోంది. 30 ట్రిలియన్ డాలర్ వ్యవస్థగా వృద్ధి చెందుతోంది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, జీఎస్టీలాంటి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది. ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ ప్రొఫెషనల్స్‌లో ఒకరు భారతీయులైతే.. నలుగురు భారతీయుల్లో ఒకరు ఉమ్మడి ఏపీకి చెందినవారు ఉన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రపంచానికి నిపుణులను అందించాం. సైబరాబాద్ హైటెక్ సిటీని ఎల్అండ్‌టీ 14 నెలల్లో నిర్మించింది. ఇప్పుడు అమరావతి క్వాంటమ్ వ్యాలీని కూడా నిర్మిస్తోంది. మన యువత భవిష్యత్తు తేజోవంతంగా కనిపిస్తోంది. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ కృష్ణలాంటి వారు దిగ్గజ కంపెనీలకు సారథ్యం వహిస్తున్నారు. గతంలో ఐటీ అనుబంధ సేవలను వివిధ దేశాలకు భారత్ నుంచే అందించాం. ముఖ్యంగా తెలుగువారే అందించారు. విశాఖలో ఇప్పుడు గూగుల్ వంటి అతిపెద్ద సంస్థ డేటా సెంటర్‌ను స్థాపిస్తోంది. అతిపెద్ద సీ-కేబుల్ వేను నిర్మిస్తోంది.

### పలు రంగాల్లో క్వాంటమ్ పరిశోధనలు

'రాష్ట్రాన్ని క్వాంటమ్ హబ్‌తో పాటు గ్రీన్‌హైడ్రోజన్ హబ్‌గా మారుస్తున్నాం. రాష్ట్ర ఇరవై ఏళ్ల భవిష్యత్తుకు కార్యాచరణను సిద్ధం చేశాం. ప్రధాని మోదీ చొరవతో స్థాపించిన నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా రాష్ట్రానికి ఎన్నో పెట్టుబడులు వస్తున్నాయి. ఐటీ విప్లవం తరహాలోనే క్వాంటమ్ కంప్యూటింగ్ విప్లవాన్ని కూడా భారతీయులు అందిపుచ్చుకోవాల్సి ఉంది. వైద్యం, విద్యుత్తు, సుస్థిర వ్యవసాయం, ఫైనాన్షియల్ మోడలింగ్, మెటీరియల్ డిస్కవరీ, వెదర్ ఫోర్ కాస్టింగ్ వంటి అంశాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలు అవసరమవుతాయి క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలకు ఆకాశమే హద్దు. వ్యక్తిగత ఔషధాలు, ప్రివెంటివ్ క్యూర్, హెల్త్‌కు సంబంధించి క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనలు సహకరిస్తాయి' అని చంద్రబాబు చెప్పారు.

# కొండపై కల్తీకి కట్టడి

**తిరుపతి**

కల్తీ నెయ్యి, నాణ్యత లేని దినుసులతో శ్రీవారి ప్రసాదాలను తయారుచేసి జగన్ పాలనలో తిరుమల పవిత్రతను మంటగలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భ్రష్టు పట్టిన వ్యవస్థల ప్రక్షాళనను తిరుమల నుంచే ప్రారంభిస్తున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ప్రభావం కొండపై కనిపించడం మొదలైంది. నైవేద్యాలు, ప్రసాదాల తయారీకి వినియోగించే సరుకుల నాణ్యతపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కఠిన వైఖరి అవలంబిస్తోంది. కొంచెం తేడా అనిపించినా సరుకులను నిర్ద్వందంగా తిరస్కరిస్తోంది. ఫలితంగా నెయ్యి సహా దినుసుల నాణ్యత గత ఏడాదిన్నర కాలంలో పెరిగింది. ప్రసాదాలు బాగున్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నెయ్యి నాణ్యతపై ప్రస్తుతం ఎలాంటి ఫిర్యాదులూ రావడం లేదు. గత ఏడాదిన్నర కాలంగా ఒక్క నెయ్యి ట్యాంకర్ కూడా వెనక్కి తిప్పి పంపే అవసరం రాలేదు. అలాగే ఇతర సరుకుల నాణ్యత విషయంలో కూడా రాజీ పడడం లేదు. గతేడాది జూలై నుంచి ఈ నెల మొదటి వారం వరకు కర్ణాటకకు చెందిన నందిని డెయిరీ పది లక్షల కిలోల నెయ్యి టీటీడీకి సరఫరా చేసింది. ఈ ఏడాదన్నర వ్యవధిలోనే వేర్వేరు టెండర్లలో పాల్గొన్న ఈ డెయిరీ కిలో రూ.498 నుంచి రూ.716 వరకూ వేర్వేరు ధరలతో నెయ్యిని టీటీడీకి సరఫరా చేసింది. నందిని డెయిరీ టెండరు గడువు ముగిసిన నేప?థ్యంలో ప్రస్తుతం గుంటూరు జిల్లా సంగం డెయిరీ 10 లక్షల కిలోలు, మహారాష్ట్రలోని పుణెకు చెందిన ఇందాపూర్ డెయిరీ 6.50 లక్షల కిలోలు, తిరుపతికే చెందిన మదర్ డెయిరీ 3.50 లక్షల కిలోలు చొప్పున టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి. ఈ డెయిరీలు కిలో రూ.655 ధరతో నెయ్యి చేరవేస్తున్నాయి. నాణ్యత లేదనే కారణంగా ఏడాదిన్నరగా ఒక్క ట్యాంకరు నెయ్యి కూడా టీటీడీ నుంచి వెనక్కి వెళ్లలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ పాలకమండళ్లు ఆమోదించిన ధరలతో పోలిస్తే ప్రస్తుతం టీటీడీ కొనుగోలు చేస్తున్న నెయ్యి ధరలు రెట్టింపు ఉన్నాయి. నాణ్యత విషయంలో రాజీ పడకపోవడమే ఇందుకు కారణమంటున్నారు. ఈ నెయ్యి వినియోగించి తయారు చేసే శ్రీవారి ప్రసాదాలపై భక్తుల నుంచీ ఫిర్యాదులు లేవు.

**తేడా కొడితే..**

టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం ఏటా రూ.600 కోట్ల విలువైన 177 రకాల సరుకులు, ఇతర వస్తువులు (ఆహార సంబంధమైనవి) కొనుగోలు చేస్తోంది. అందులో రోజువారీ వినియోగం చూస్తే నెయ్యి 15 వేల కిలోలు, జీడిపప్పు 3,500 కిలోలు, చక్కెర 40 వేల కిలోలు, బియ్యం 20 వేల కిలోలు, బెల్లం రెండు వేల కిలోలు, ఎండు ద్రాక్ష 1,500 కిలోలు, యాలకులు 500 కిలోలు ఉన్నాయి. శ్రీవారి ప్రసాదాలలో ఎక్కువగా వినియోగించే జీడిపప్పు తరచుగా నాసిరకం వస్తున్నట్టు టీటీడీ అధికారులు గుర్తించారు. ప్రతి పది లోడ్‌లలో రెండు నుంచి మూడు లోడ్‌ల సరుకు నాణ్యత లేకుండా వస్తున్నాయని గుర్తించారు. ఇలాంటి లోడ్‌లను నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నారు. గతేడాది నుంచి ఇప్పటివరకూ 18 నెలల కాలంలో 25 లారీల లోడ్‌ల జీడిపప్పును తిరస్కరించినట్టు సమాచారం. ఇదే వ్యవధిలో పది లోడ్‌ల ఎండు ద్రాక్ష, ఏడు లోడ్‌ల చింతపండు, పది లోడ్‌ల కందిపప్పు, పది లోడ్‌ల వరకూ ఎండుమిర్చిలను వెనక్కి పంపినట్టు సమాచారం.

**నాణ్యత లేకుంటే దాతలు ఇచ్చినా తిసర్కరణ**

టీటీడీకి అవసరమైన సరుకులను ఎంతోమంది భక్తులు విరాళంగా అందజేస్తుంటారు. అందులో కూరగాయలు మొదలుకుని నిత్యావసర సరుకుల వరకూ ఉంటున్నాయి. శ్రీవారి అన్న ప్రసాదాలకు సంబంధించి తిరుపతిలోని టీటీడీ వేర్ హౌస్ ప్రాంగణానికి రోజూ భక్తులు వచ్చి తమకు తోచిన వస్తువులు ఇచ్చి వెళుతుంటారు. కొందరు మొక్కులు చెల్లించుకోవడంలో భాగంగా ఇలా చేస్తుంటారు. బియ్యం, చక్కెర, జీడిపప్పు, నెయ్యి, కందిపప్పు, చింతపండు వంటివి ఎక్కువగా ఇస్తున్నారు. అయితే వాటి శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపి నాణ్యత బాగుంటేనే స్వీకరిస్తున్నారు. టీటీడీ వేర్‌హౌస్ ప్రాంగణంలో నాలుగు గోదాములున్నాయి. మొదటి గోదాములో 60 రకాల సరుకులు, రెండో గోదాములో మరో 60 రకాల సరుకులు, మూడో గోదాములో 57 రకాల సరుకులు నిల్వ ఉంచుతున్నారు. మరొక దానినిసబ్ గోదాముగా అత్యవసరానికి వాడుతున్నారు. ఇక... తిరుమలలోని గోదాము‌ను నెయ్యి, చక్కెరల నిల్వకు మాత్రమే వినియోగిస్తున్నారు.

# రికార్డుపై బాహుబలి గురి!

**సూళ్లూరుపేట, డిసెంబరు 23**

వాణిజ్య ప్రయోగాల్లో ఇస్రో మరో కీలక మైలురాయికి చేరువైంది..! తన బాహుబలి రాకెట్ ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమైంది. ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన కొత్తతరం కమ్యూనికేషన్ ఉపగ్రహం 'బ్లూబర్డ్ బ్లాక్-2'ని కక్ష్యలోకి చేర్చేందుకు ఏర్పాట్లు పూర్తిచేసింది. బుధవారం ఉదయం 8.54 గంటలకు చేపట్టే ఈ ప్రయోగానికి తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ వేదిక కానుంది. ఈ ప్రయోగానికి సంబంధించిన 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం ఉదయం 8.54 గంటలకు ప్రారంభమైంది. కౌంట్‌డౌన్ పూర్తవగానే బుధవారం ఉదయం 8.54 గంటలకు 6,400 కిలోల బరువున్న బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని తీసుకుని ఎల్వీఎం-3-ఎం6 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. 15.07 నిమిషాల్లో రాకెట్ మూడు దశలు పూర్తికాగానే లో ఎర్త్ ఆర్బిట్ (లియో)లోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనుంది. అమెరికాకు చెందిన ఏఎసటీ స్పేస్‌మొబైల్ సంస్థతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఇస్రో ఈ వాణిజ్య ప్రయోగాన్ని చేపడుతోంది. కాగా, భారత భూభాగం నుంచి ఇస్రో రాకెట్ ద్వారా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చడం ఇదే తొలిసారి. అందుకే ఈ ప్రయోగం విజయవంతమైతే ఇస్రో సరికొత్త రికార్డు నెలకొల్పనుంది. ఇప్పటి వరకూ ఉన్న 4,400 కిలోల ఉపగ్రహ ప్రయోగ రికార్డు మరుగున పడనుంది. వాణిజ్య ప్రయోగాల్లో ఇస్రోకిది మరో కీలక మైలురాయి కాబోతోంది. మంగళవారం ప్రారంభమైన 24 గంటల కౌంట్‌డౌన్ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ సమయంలోనే రాకెట్‌కు ఇంధనాన్ని నింపే కార్యక్రమాన్ని పూర్తిచేసిన శాస్త్రవేత్తలు రాకెట్‌లోని అన్ని దశల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ కౌంట్‌డౌన్ ప్రక్రియను పరిశీలించారు.

### ఇస్రోపైనే అందరి దృష్టి..

బ్లూబర్డ్ ఉపగ్రహ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణ ఎల్వీఎం-3 రాకెట్. దీన్ని ఇస్రో బాహుబలిగా పిలుస్తారు. ఇది 43.5 మీటర్ల ఎత్తు, 640 టన్నుల బరువు ఉంటుంది. ఇది 4,400 కిలోల బరువున్న భారీ పేలోడ్లను సైతం జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి అలవోకగా మోసుకెళ్లగలదు. లో ఎర్త్ ఆర్బిట్‌లోకి మరింత బరువున్న పేలోడ్లను తీసుకెళ్లగలదు. ఇస్రోకిది అత్యంత నమ్మదగిన రాకెట్. దీంతో చేపట్టిన గత ఎనిమిది ప్రయోగాలూ (టెస్ట్ ఫ్లైట్ సహా) విజయవంతమయ్యాయి. వాటిలో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-3 కూడా ఉంది. ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎసఐఎల్), అమెరికాకు చెందిన ఏఎసటీ స్పేస్‌మొబైల్ మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా ఇస్రో ఈ మిషన్ చేపడుతోంది. భారత గడ్డపై నుంచి ఇంతటి బరువైన ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం-3 మోసుకెళ్తున్నందున.. ఇప్పుడు ప్రపంచం దృష్టంతా ఇస్రోపైనే ఉంది. కాగా, ఎల్వీఎం-3 ద్వారా చేపడుతున్న మూడో వాణిజ్య ప్రయోగమిది. గతంలో వన్‌వెబ్ సంస్థకు చెందిన రెండు వాణిజ్య ఉపగ్రహాలను ఈ రాకెట్ కక్ష్యలోకి చేర్చింది.

# సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల..

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా (ఏఎస్‌జీ) ఆయన్ను నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

ఈ నియామకంతో కనకమేడల సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో వాదనలు వినిపిస్తారు. అదనపు సొలిసిటర్ జనరల్ పదవి కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థలో అత్యంత ముఖ్యమైనది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టులలో ప్రభుత్వం తరపున వాదించాల్సి ఉంటుంది.కనకమేడల రవీంద్ర కుమార్‌కు న్యాయ, రాజకీయ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టు, హైకోర్టులలో పలు కీలక కేసులను వాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున కూడా గతంలో వాదనలు వినిపించారు. రాజ్యాంగం, పరిపాలన అంశాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. 2018 నుంచి 2024 వరకు టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, పార్లమెంటులో చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ లీగల్ సెల్‌లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో, ఆ పార్టీకి చెందిన నేతకు ఇంతటి ముఖ్యమైన న్యాయ పదవి దక్కడం రాజకీయంగా కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కేసుల్లో బలమైన న్యాయ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

# మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపో యిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

లొంగిపోయిన మవోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే-47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది.

తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.

# వ్యక్తిగత ఇష్టాయిష్టాలను సహించం

**హైదరాబాద్, డిసెంబరు 23**

ప్రభుత్వ విధానాలను పారదర్శకంగా అమలు చేయాలని, వాటి అమల్లో వ్యక్తిగత ఇష్టాయిష్టాలను ప్రదర్శిస్తే సహించేది లేదని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పథకాల అమల్లో బాగా పని చేసిన అధికారులను హెూదాతో సంబంధం లేకుండా గౌరవిస్తామని, ఆశించిన స్థాయిలో పని చేయని అధికారులు ఎంత పెద్ద హెూదాలో ఉన్నా ఊరుకోబోమని, తగిన చర్యలుంటాయని తేల్చి చెప్పారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో మంగళవారం సచివాలయంలో ఆయన సమావేశమయ్యారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 9 గంటల వరకు సుదీర్ఘంగా జరిగింది. ఇటీవల ఒకచోట డంప్ యార్డు ఏర్పాటుకు స్థలం కేటాయించి, మళ్లీ ఆ స్థలాన్ని డంప్ యార్డుకు ఎలా కేటాయించారంటూ ఒకే శాఖ రెండు రకాలుగా వ్యవహరించడంతో సంబంధిత అధికారిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకున్నామని సంబంధిత అధికారి జవాబిచ్చినట్లు తెలిసింది. అలాగే, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కృష్ణా, గోదావరి బేసిన్లకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని సాగునీటి శాఖ ఉన్నతాధికారిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. ఆ వివరాలతో సీఎం కార్యాలయం మీడియాకు ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్నదాని కంటే అధికారులు తమ పనితీరును మరింత మెరుగుపర్చుకోవాలని, పనితీరులో మార్పు రాకపోయినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠినంగా వ్యవహరిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఇకనుంచి అధికారుల పనితీరును స్వయంగా సమీక్షిస్తానని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. శాఖల కార్యదర్శుల పనితీరుపై ప్రతి నెలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సమీక్షిస్తారని, వారు ఆయనకు తమ పనితీరు నివేదికను సమర్పించాలని సూచించారు.

# నెమళ్లకుంట దత్తత గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

## – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.





**పల్లె వెలుగు బండి ఆత్మకూరు:** బండిఆత్మకూరు మండలం, నెమళ్లకుంట గ్రామాన్ని జిల్లా కలెక్టర్ దత్తత గ్రామంగా తీసుకుని అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళ వారం బండిఆత్మకూరు మండలంలో జిల్లా కలెక్టర్ దత్తత తీసుకున్న నెమళ్లకుంట గ్రామంలో పునరుద్ధరణ పనులు పూర్తిచేసుకున్న పెద్దమ్మతల్లి దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో నెమళ్లకుంట గ్రామానికి పర్యటన చేసిన సమయంలో గ్రామస్థులు పెద్దమ్మతల్లి దేవాలయ పునరుద్ధరణతో పాటు ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ఏర్పాటు, అంగన్వాడీ కేంద్రం నిర్మాణం వంటి అభివృద్ధి పనులను చేపట్టాలని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అందులో భాగంగా ముందుగా పెద్దమ్మతల్లి దేవాలయ పునరుద్ధరణ పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరగా, అర్హత ప్రమాణాల ప్రకారం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పెన్షన్లు మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు అవసరమైన వంట సౌకర్యాల కల్పనలో భాగంగా సుమారు 44 గ్యాస్ స్టవ్‌లు మరియు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా త్వరితగతిన గ్యాస్ కనెక్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. దత్తత గ్రామంగా తీసుకున్న నెమళ్లకుంటలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, తాసిల్దార్, ఎంపీడీవో తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఆధార్ అప్డేట్ ద్వారా ప్రభుత్వ సేవలు

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 22:** గ్రామ వార్డు సచివాలయాల్లో మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ అనేది చిన్నపిల్లల ఆధార్ కార్డులకు సంబంధించి చాలా కీలకమైన ప్రక్రియ. ఇది కేవలం ఆధార్ అప్డేట్ మాత్రమే కాదు, దీనివల్ల అనేక ప్రభుత్వ సేవలు ముడిపడి ఉన్నాయి. వీటి యొక్క ప్రధాన ఉపయోగాలు మరియు ఆవశ్యకత గురించి పరిశీలిస్తే... పిల్లల కోసం తప్పనిసరిగా ఐదు సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వయసు కలిగిన వారు ఆధార్ నిబంధన ప్రకారం పిల్లలకు రెండుసార్లు బయోమెట్రిక్ వివరాలను అప్డేట్ చేయడం తప్పనిసరి. మొదటిసారి 5 ఏళ్ళు నిండినప్పుడు ఐదు ఏళ్లలోపు పిల్లలకు కేవలం తల్లిదండ్రుల ఆధారంతో కార్డు ఇస్తారు. వారు బయోమెట్రిక్ తీసుకోరు కాబట్టి 5 ఏళ్ళు నిండగానే వారి సొంత బయోమెట్రిక్ నమోదు చేయాలి.రెండవసారి 15 ఏళ్లు నిండినప్పుడు పిల్లలు పెద్దవారయ్యేకొద్దీ వారి వేలిముద్రలు మరియు కంటిపాపల్లో మార్పు వస్తాయి. అందుకే 15 ఏళ్ళు నిండగానే మళ్లీ అప్డేట్ చేయాలి. చాలా కార్పొరేట్ మరియు ప్రభుత్వ పాఠశాలలు అప్డేటెడ్ ఆధార్ ను అడుగుతున్నాయి. పదవ తరగతి లేదా ఇతర పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసేటప్పుడు బయోమెట్రిక్ వివరాలు ఆధార్ తో సరిపోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసి అనేక పథకాలు ఆధార్ బయోమెట్రిక్ మీదనే ఆధారపడి ఉన్నాయి. తల్లికి వందనం పథకం కింద వచ్చే నగదు జమ కావడంతో ఇబ్బందులు రావచ్చు. రేషన్ కార్డులో పిల్లల పేర్లు ఉన్న ఈకేవైసీ,ఎంబీయూ అవ్వకపోతే వారి వాటా రేషన్ నిలిచిపోయే అవకాశం ఉంది. విద్యార్థుల విద్యా జీవన, లేదా వసతి జీవన వంటి పథకాలకు ఇది చాలా ముఖ్యం. ఐదేళ్లు మరియు 15 ఏళ్లు దాటిన తర్వాత బయోమెట్రిక్ అప్డేట్ చేయకపోతే సదర్ ఆధార్ కార్డు డి ఆక్టివేట్ అయ్యే అవకాశం ఉంది. అలా జరిగితే కొత్త ఆధార్ కోసం మళ్లీ మొదటి నుంచి ప్రయత్నించాల్సి ఉంటుంది.

## నంద్యాల జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్ కి వినతి పత్రం అందజేసిన అంబులెన్స్ యూనియన్ సభ్యులు .



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** నంద్యాల జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్ ను కలిసి 108 కాంట్రాక్ట్ అంబులెన్స్ యూనియన్ సభ్యులు వినతి పత్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ మేరకు కూటమి ప్రభుత్వ నాయకులకు వినతి పత్రం అందజేయాలని తెలపడంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని 108 ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధంగా ప్రతి 108 అంబులెన్స్ ఉద్యోగికి జీవో నెంబర్ 49 ప్రకారం నెలకు రూ.4 వేల చొప్పున అదనంగా ఇవ్వాలని,108 సర్వీసులలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరారు. భవ్య మెడికల్ సర్వీస్ వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈపీఎఫ్ఓ యాజమాన్య వాటాను యాజమాన్యమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 5సం//,10సం// సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగికి ఆటోమేటిక్ గా స్లాబ్ ఆఫ్టెడిషన్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందుకున్న నంద్యాల జనసేన సమన్వయకర్త పిడతల సుధాకర్ ఈ విషయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి 108 అంబులెన్స్ ఉద్యోగుల సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అంబులెన్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జాతీయ రైతు దినోత్సవం





**పల్లె వెలుగు నంద్యాల రూరల్. :** నంద్యాల పట్టణంలోని స్థానిక పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అ కాడమీ పాఠశాలలో డిసెంబర్ 23వ తేదీన అనగా శనివారము జాతీయ రైతు దినోత్సవం జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.జి. వి.రవీంద్రనాథ్ , ప్రిన్సిపల్ మాధవీలత మేడం మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక లాంటివాడు రైతు లేనిదే మనిషి లేడని అన్నారు. దేశాన్ని రక్షించే జవానులకు ఎంత ప్రాముఖ్యత ఉందో పట్టెడన్నం పెట్టే రైతన్నలకు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది అందుకే జై జవాన్ జై కిసాన్ అనే నినాదం యావత్ భారతావనిలో వినిపిస్తుందని అన్నారు . రైతుల గురించి వ్యవసాయ రంగం గురించి అంతగా ఆలోచించి వారి సమస్యల పరిష్కారానికి చరణ్ సింగ్ చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వం ఆయన డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవం గా ప్రకటించింది. భారతదేశ ఐదవ ప్రధానమంత్రిగా సేవలను అందించారు భారతదేశపు రైతుల విజేతగా రైతు బంధువుగా పేర్కొన్నారు భారత ప్రభుత్వం ఆయన చిత్రంతో 1998 29న తపాలా బిళ్ళను విడుదల చేసింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు అందరూ కలిసి మహానందికి వెళ్లి అక్కడ ఉండే పొలాల్లో రైతులు చేసే పనులను స్వయంగా వారి చేస్తూ రైతులు పడే శ్రమను కష్టమును గురించి చక్కగా తెలియజేశారు మరియు రైతు గొప్పతనాన్ని వివరించే పాటలు,ఉపన్యాసాలు లఘు నాటికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి.రవీంద్రనాథ్ , ప్రిన్సిపల్ మాధవీలత మేడం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నంద్యాల - గుంతకల్లు మధ్య పగటి పూట రైలు – నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** నంద్యాల జిల్లా రైలు ప్రయాణికుల ఇబ్బందులు ఇటీవల పార్లమెంట్ వేదికగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ దృష్టికీ నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తీసుకెళ్లారు. లోక్ సభలోనే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విన్నపాన్ని పరిగణలోకి తీసుకుంటామని రైల్వే శాఖ మంత్రి పార్లమెంట్ లో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు గుంతకల్లు నుంచి నంద్యాల మీదుగా మార్కాపురం రోడ్డు వరకు పగటి పూట రైలు నడుపనున్నట్లు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం తెలిపారు. మార్కాపురం బి నంద్యాల బి గుంతకల్ రూట్ లో ప్యాసింజర్ ట్రైన్ కు రైల్వే మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనీ, ఈ ట్రైన్ నెంబర్(57408)మార్కాపురంలో తెల్లవారు జామున 4:30 గంటలకు ప్రారంభం అయ్యి నంద్యాలకు ఉదయం 7:20 గంటలకు చేరుకొని డోన్ మీదుగా గుంతకల్లుకు ఉదయం 10:30 గంటలకు చేరుకుంటుందనీ, ఇదే ట్రైన్ నెంబర్(57407) తిరుగు ప్రయాణంలో గుంతకల్లులో సాయంత్రం 5:30 కి ప్రారంభం అయ్యి నంద్యాల కు రాత్రి8:30 కి చేరుకొని మార్కాపూర్ కు 10:30 గంటలకు చేరుకుంటుందనీ, త్వరలో పట్టాలు ఎక్కనున్న ఈ రైలును నంద్యాల జిల్లా ప్రజలు గుంతకల్లు వైపు పగటి పూట రైలు ప్రయాణం సద్వినియోగం చేసుకువాలని, తన విన్నపాన్ని అంగీకరించి నంద్యాల - గుంతకల్లు వైపు పగటి పూట రైలు వేసినందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధన్యవాదములు తెలిపారు.

## నంద్యాలలో మెగా జాబ్ మేళా ను ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్





**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** నంద్యాల స్థానిక నేషనల్ డిగ్రీ కాలేజ్ నందు ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు ముఖ్యఅతిథిలుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నేషనల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇంతియా అహ్మద్ పాల్గొని గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ఎన్ఎండి ఫయాజ్ జాబ్ మేళాను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ “ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు తలుపు తట్టినప్పుడు వాటిని వదులుకోకూడదని . నిరుద్యోగ యువతకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒకే వేదికపైకి ఇన్ని బహుళజాతి కంపెనీలను తీసుకురావడం అభినందనీయని అన్నారు . యువత తమలో ఉన్న ప్రతిభను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలన్నారు”. “కేవలం డిగ్రీ పట్టాలు ఉంటే సరిపోదని, మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను (స్కిల్స్) మెరుగుపరుచుకోవాలన్నర. నిరంతరం నేర్చుకునే తత్వం ఉన్నవారికే కార్పొరేట్ రంగంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు . స్థానిక యువతకు స్థానికంగానే ఉపాధి కల్పించడమే ఈ మేళా యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రతి విద్యార్థి ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అన్నారు . ఈరోజు చిన్న ఉద్యోగంలో చేరినప్పటికీ, నిరంతర కృషి, పట్టుదలతో పని చేస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. యువత తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ మెగా జాబ్ మేళాలో దాదాపు 22 కంపెనీలు 2100 ఉద్యోగాలకు పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించాయన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తమ కళాశాల వేదికగా ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. చదువుకున్న ప్రతి యువకుడికి, యువతికి ఒక గౌరవప్రదమైన ఉద్యోగం లభించాలనేది మా ఆశయమని అందుకే విద్యార్థుల ముంగిటకే ఉద్యోగ అవకాశాలను తీసుకురావాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థతో ఈ ‘మెగా జాబ్ మేళా’ను ఏర్పాటు చేశామన్నారు . నంద్యాల జిల్లాలోని యువతలో అద్భుతమైన తెలివితేటలు ఉన్నాయని. సరైన వేదిక దొరికితే వారు ప్రపంచ స్థాయిలో రాణించగలరన్నారు. ఇంటర్వ్యూలలో పాల్గొనే అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాలని . ఒక్కసారి అవకాశం రాకపోయినా నిరాశ చెందకుండా, మనలో ఉన్న లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలన్నారు . నేషనల్ విద్యాసంస్థలు కేవలం నాణ్యమైన విద్యకే కాకుండా, విద్యార్థుల కెరీర్ గైడెన్స్ మరియు ప్లేస్‌మెంట్స్ విషయంలో కూడా ఎప్పుడూ ముందుంటాయన్నారు .

ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దస్తగిరి, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ స్వామి నాయక్, కామిని మల్లికార్జున, దీపక్ రెడ్డి, నేషనల్ విద్యాసంస్థల సెక్రటరీ రఫీ అహ్మద్ , నేషనల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ వేణుగోపాల్, ప్లేస్మెంట్ అధికారి సాయికుమార్, మస్తాన్ వలి, మారుతి ప్రసాద్, కళాశాల అధ్యాపక బృందం , టిడిపి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## ఆర్టిఐ యాక్ట్ అసోసియేషన్ క్యాలెండర్ల ఆవిష్కరణ



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 23 :** సమాచార హక్కు కార్యకర్త సంఘం క్యాలెండర్లను ఆర్టిఐ యాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు వడ్డే విశ్వనాథ్ రాజు, నియోజకవర్గ సభ్యుడు వెంకటగిరి ఆధ్వర్యంలో మంగళవారం హొళగుంద ఎంపిడిఓ విజయ లలిత, ఎమ్మార్వో నిజాముద్దీన్ చేతుల మీదుగా ఆర్టిఐ యాక్ట్ అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ యాక్ట్) 2005లో భారతదేశంలో అమల్లోకి వచ్చింది, ఇది పౌరులకు ప్రభుత్వ సంస్థల నుండి సమాచారాన్ని పొందే అధికారం ఇస్తుంది, పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతుందని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకునేవారు rtiassociation.com అనే వెబ్సైట్లు చట్టానికి సంబంధించిన సమాచారం పొందుపరిచి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఐ యాక్ట్ అసోసియేషన్ సభ్యుడు మంజు, ఏపీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు నాగరాజు, సభ్యులు మంజు, తాహేర్, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, పెద్దయ్యట మల్లయ్య, వీరభద్ర, వీరేష్ , అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధ మహిళలకు, వితంతు మహిళలకు చీరలు పంపిణీ






**నంద్యాల . డిసెంబర్ 23 . (పల్లె వెలుగు ):** భాను రూరల్ అండ్ అర్బన్ రీసెర్చ్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ దనాల రవికాంత్ బాబు ఆధ్వర్యం లో క్రిస్మస్ పండుగ సందర్భంగా వృద్ధ మహిళలకు, వితంతు మహిళలకు, చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలు గా విచ్చేసిన మాధవి, నంద్యాల రూరల్ రెవెన్యూ స్పెక్టర్, మరియు మల్లికార్జునప్ప , నంద్యాల ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, వీరి ఇద్దరు చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. వీరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం చేసిన దాతలు దేవరగుట్టు మాబుబాష ,మల్లికార్జునప్ప,నిజాముద్దీన్ , వీరికి నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. భాను సొసైటీ అధ్యక్షులు లయన్ దనాల రవికాంత్ బాబు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా పేద ప్రజలకు గత ఐదు సంవత్సరాలుగా సేవ చేయడం చాల సంతోషం ఉంది, ప్రతి ప్రతి సంవత్సరం కులమతాలకు అతీతంగా పేదలకు సేవ చేస్తున్నాం, దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి మీ వంతు సహాయఓ అందిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి భాను సంస్థ ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, సునీత, దూదేకుల హుస్సేన్ బి, కమలమ్మ ,మేరీ, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ పండుగకు అంబేద్కర్ భావజాలంతో సేవా కార్యక్రమం

## - 30 మంది నిరుపేద కుటుంబాలకు చీరల పంపిణీ





**పోరుమామిళ్ల డిసెంబర్ 23 ( పల్లె వెలుగు ) :** పోరుమామిళ్ల మండలంలోని ఎస్టీ కాలనీలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని అంబేద్కర్ హాస్య సాధకుడు, సీనియర్ దళిత నాయకుడు ముత్యాల చెనరాయుడు గారి కుటుంబ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరంలో ఉన్న న్యూస్ వచ్చినటువంటి కుటుంబాలకు చెందిన 30 మంది మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోరుమామిళ్ల మండల %ఖు%. కేజియా. ఆర్.ఐ. సుధాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రవి పాల్గొని, ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇలాంటి మానవీయ కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ముత్యాల చెనరాయుడు గారు గతంలో కూడా అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టారని, ముఖ్యంగా దళిత, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల లబ్ధిదారులైన కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తూ, చెనరాయుడు కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల చెనరాయుడు, రోజమ్మ, ప్రకాష్, జ్యోతి, శేఖర్, మంజుల, పృథ్వీరాజ్, ఝాన్సీతో పాటు కుటుంబ సభ్యులు మరియు మనవాళ్లు పాల్గొన్నారు. ఈ సేవా కార్యక్రమానికి స్పాన్సర్ దాతగా ఝాన్సీ వ్యవహరించారు. క్రిస్మస్ పండుగను కేవలం ఉత్సవంగా కాకుండా, సేవా భావంతో జరపడం ద్వారా ముత్యాల చెనరాయుడు కుటుంబం మానవత్వానికి అద్దం పట్టిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అధిక ధరలకు ఎరువులు మందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

## - వ్యవసాయ అధికారులు సుధాకర్ ప్రమీల






**దొర్నిపాడు డిసెంబర్ 23 పల్లె వెలుగు న్యూస్ :** రసాయన ఎరువులు క్రిమిసంహారిక మందులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే షాపు లైసెన్సులు రద్దు చేస్తామని కోయిలకుంట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్ దొర్నిపాడు మండల వ్యవసాయ అధికారిని ప్రమీలఅన్నారు, మంగళవారందొర్నిపాడు గ్రామంలోని పలు ఎరువులమరియు పురుగు మందుల దుకాణాలను కోయిలకుంట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ సుధాకర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. తనిఖీ లో భాగంగా స్టాక్ రిజిస్టర్ , ధరల బోర్డు మరియు బిల్లు బుక్ లలో ఉన్న స్టాక్ తో సరి చూసారు. ఎరువులు మరియు పురుగు మందులు ఎక్కువ ధరలకు విక్రయించినచో లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలను చర్యలు తీసుకోబడును అని హెచ్చరించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి శ్రీమతి ప్రమీల మాట్లాడుతూ దొర్ని పాడు మండలం లోని అన్ని ఫెర్టిలైజర్ షాపుల యజమానులందరికి తెలియజేయడమేమనగా యూరియా మరియు ఇతర రసాయనిక ఎరువులను %వీ=ా% ధర కంటే ఎక్కువ ధరలకు విక్రయించరాదు. అట్లు చేసినయెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామనినోటీస్ జారీ చేశారు. ఈ కార్యక్రమం లో షాప్ యజమానులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# అభివృద్ధికి ఇది పునాది మాత్రమే

## - కలెక్టర్ రాజకుమారి గనియా
## - ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ







బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 22: గిరిజన గూడెంలో చెంచుల అభివృద్ధికి ఇది పునాది మాత్రమేనని రాబోవు రోజులలో నెమళ్ల కుంటలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ప్రకటించారు. మంగళవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న గాలి చెన్నయ్యపాలెం గ్రామానికి సమీపంలో ఉన్న నెమళ్ళ కుంట చెంచుగూడెం ను కలెక్టర్ సందర్శించారు. పి ఫోర్ లో భాగంగా నెమళ్ల కుంటను కలెక్టర్ దత్తత తీసుకున్నారు. ఈ ఏడాది జూలై నెల 17వ తేదీన కలెక్టర్ చెంచుగూడెం ను సందర్శించి దత్తత తీసుకున్నట్లుగా ప్రకటించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ సమస్యలను ఏ కరువు పెట్టారు. గాలి చెన్నయ్యపాలెం గ్రామం నుండి నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ప్రస్తుత ద్వారా ప్రధాన మార్గంలో వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. తమకు పొలాలు ఉన్నప్పటికీ ఆన్లైన్లో నమోదు కాలేదని నమోదు చేయించి పాసుబుక్కులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నెమళ్ళ కుంట గూడెంలో పెద్దమ్మ తల్లి దేవాలయం పాడుబడిపోయిందని దేవాలయానికి మరమ్మతులు చేయించి పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్కు అప్పట్లో విజ్ఞప్తి చేశారు. ఆర్వో ప్లాంటుతో పాటు అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సంత జూటూరు నుండి లింగాపురం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు ఏళ్ల తరబడి నుండి అధ్వానంగా ఉందని దానికి వెంటనే నిధులు మంజూరు చేయించాలని కర్నూలు కడప కాల్వ చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి అప్పట్లో కలెక్టరు దృష్టికి తెచ్చారు. నాయకులు సమస్యలు ప్రస్తావించిన మేరకు సిఎస్ఆర్ గ్రాంట్ కింద 14.5 లక్షల రూపాయల నిధులను సెప్టెంబర్ నెలలో కలెక్టర్ మంజూరు చేశారు. శ్రీశైలం శాసనసభ్యుడు బుడ్డా రాజశేఖర్ రెడ్డి సిఫారసు మేరకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద 20 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మించేందుకుగాను కలెక్టర్ మంజూరు చేశారు. గిరిజనుల విజ్ఞప్తి పెద్దమ్మతల్లి మేరకు దేవాలయాన్ని పునరుద్ధరించారు. పెద్దమ్మతల్లి ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 32 మంది గిరిజనుల కుటుంబాలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను స్టవ్ లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్ షిప్ (పి 4) ద్వారా అతి పేద కుటుంబాలను గుర్తించి అటువంటి వారిని అభివృద్ధిలోకి తీసుకొని రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. పి ఫోర్ ద్వారా అభివృద్ధి చెందిన ప్రాంత వాసులు ఇతరులకు మార్గదర్శకాలు కావాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేసే బాధ్యతను పూర్తిగా కలెక్టర్లకు అప్పగించారని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో 35 వేల కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 14 మండలాల్లో 48 చెంచుగూడెంలో 48 చెంచుగూడెంలు ఉండగా, వారిలో 8500 మంది జనాభా మాత్రమే ఉన్నారని అన్నారు. నంద్యాల జిల్లాలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేస్తూ ఉంటారని దీన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం చెంచుగూడెం ప్రాంతాల్లో అగర్బత్తీలు పేపర్ ప్లేట్లు తయారీకి గిరిజనులను ప్రోత్సహించడం జరిగిందని అన్నారు. నెమళ్ళ కుంట గూడేనికి

తాను రెండవసారి రా వడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. గూడెనికి రాకముందు ముందుగా ఈ ప్రాంతంలో మా టీం వచ్చి ఇక్కడ సర్వే చేయడం జరిగిందని అన్నారు. ఈ మేరకు గూడెంలో సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు రాజంరెడ్డి మనోహర్ రెడ్డి, తాసిల్దార్ పద్మావతమ్మ ఎంపీడీవో గాయత్రి, పంచాయతీరాజ్ హౌసింగ్, శాఖలకు చెందిన ఏఈలు వెంకటరాముడు, వాసుదేవుడు, అంగన్వాడి విద్యా శాఖలకు చెందిన అధికారులతో పాటు ఐటీడీఏ కి చెందిన అధికారులు ఉప సర్పంచ్ లింగారెడ్డి మోహన్ లింగేశ్వరరావు గోపాల్, రమణ తదితరులు పాల్గొన్నారు

# రీ-సర్వే అక్రమార్కులపై యుద్ధం

## -ఏడీ ముని కన్నన్, రుద్రమునిలే టార్గెట్!
## - రైతుల రక్తం తాగుతున్న అవినీతి తిమింగలాలు
## - లాగిన్ల పేరుతో లక్షల దోపిడీ.. బదిలీల్లోనూ బేరసారాలు
## - వీరిని తొలగించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం: వి.వి.నాయుడు హెచ్చరిక



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** జిల్లా సర్వే శాఖలో అవినీతి పరాకాష్టకు చేరిందని, అసిస్టెంట్ డైరెక్టర్ ముని కన్నన్, సీనియర్ డ్రాఫ్ట్‌మ్యాన్ రుద్రమునిల కబంధ హస్తాల్లో రైతులు విలవిలలాడుతున్నారని రాయలసీమ యువజన పోరాట సమితి అధ్యక్షులు వి.వి.నాయుడు నిప్పులు చెరిగారు. మంగళవారం కర్నూలు బిర్లా కంపౌండ్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన అధికారుల అక్రమాలను సాక్ష్యాధారాలతో ఎండగట్టారు. అవినీతికి అడ్డాగా జిల్లా సర్వే కార్యాలయంరీ-సర్వే తప్పిదాల వల్ల భూ యజమానులు నరకయాతన అనుభవిస్తుంటే, అదే తమకు వరప్రసాదంగా మార్చుకుని ఈ ఇద్దరు అధికారులు కోట్లు గడిస్తున్నారని నాయుడు ధ్వజమెత్తారు. “భూమి విస్తీర్ణం మార్చాలన్నా, ఎల్పీఎం నెంబర్లు సరిచేయాలన్నా అడిగేది లక్షలే! ముడుపులు అందితేనే లాగిన్ ముందుకు కదులుతుంది.. లేదంటే ఫైల్ చెత్తబుట్టలోకి వెళ్తుంది” అని ఆరోపించారు. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో ఫైళ్లను రిజెక్ట్ చేస్తూ, రైతులను కార్యాలయాల చుట్టూ భిక్షగాళ్లలా తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు.

**బదిలీల దందా: ఒక్కో పోస్టింగ్‌కు 5 లక్షలు!**

కేవలం రైతులనే కాకుండా, తోటి ఉద్యోగులను కూడా వదలని వీరి లంచగొండితనం గరిష్ట స్థాయికి చేరిందని నాయుడు ఆరోపించారు. డిమాండ్ ఉన్న గ్రామాల్లో పోస్టింగ్‌ల కోసం గ్రామ సర్వేయర్ల దగ్గర ఒక్కొక్కరి నుంచి రూ. 5 లక్షలు వసూలు చేశారని, వీరి వేధింపులు భరించలేక క్రింది స్థాయి సిబ్బంది కుమిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేసీని తప్పుదోవ పట్టిస్తున్న అక్రమార్కులు కొత్తగా వచ్చిన జాయింట్ కలెక్టర్ గారికి జిల్లా పరిస్థితులపై అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, ఈ ఇద్దరు అధికారులు చక్రం తిప్పుతున్నారని నాయుడు విమర్శించారు. గతంలో జిల్లా స్థాయికి ఫైల్ వచ్చిందంటే పారదర్శకత ఉంటుందని నమ్మేవారమని, కానీ ఇప్పుడు ప్రతి ఫైల్ వెనుక ‘ముని కన్నన్ - రుద్రముని’ల ముడుపుల భాగోతం దాగి ఉందని ధ్వజమెత్తారు.

**ప్రభుత్వానికి అల్టిమేటం:**

గ్రౌండ్ లెవల్‌లో పని చేసే సర్వేయర్లకే సమస్యలపై అవగాహన ఉంటుందని, ఏసీ రూముల్లో కూర్చుని లాగిన్లను హోల్డ్‌లో పెట్టే ఈ అధికారుల హక్కులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరిపై విచారణ జరిపి జైలుకు పంపాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా రైతులను ఏకం చేసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సమితి నాయకులు సీమకృష్ణ, రామిరెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# హిందూ సమ్మేళన విజయవంతం చేయాలి

## - కులం మన ఇంటికి పరిమితం
## -గడప దాటితే మన మంతా హిందూవులం..
## - ప్రతి హిందువులలో ఆత్మవిశ్వాసాన్ని అలవర్చుకోవాలి..
## - మన దేవాలయ వ్యవస్థను కాపాడుకోవాలి...
## - హాజరుకానున్న ధార్మిక ఉపన్యాస మహిళ అతిధి శ్రీ హారిక మంజునాథ్..



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 23 :** హొళగుందలో శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈనెల 27 శనివారం నిర్వహించనున్న హిందూ సమ్మేళనానికి ప్రతి ఒక్క హిందువు తరలి రావాలని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి సభ్యులు పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవకు సంఘం అనేక సంవత్సరాల నుంచి నిరంతరం శ్రమిస్తూ హిందూ సమాజాన్ని జాగృతం చేస్తూ, ప్రతి ఒక్కరిలోను జాతీయ భావాలను నిర్మాణము చేస్తూ నేడు 100వ సంవత్సరములో అడుగుపెడుతున్న సందర్భముగా హిందూ సమ్మేళనాన్ని నిర్వహించాలని “హిందూ సమ్మేళన నిర్వాహణ సమితి” తలపెట్టింది. ప్రతి హిందువులలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం కోసం నిర్వహించనున్న ఈ సమ్మేళనం మన గ్రామాలలో మరియు బస్తీలలో హిందుత్వ వాతావరణం నిర్మాణం చేయడం, మత మార్పిడిలకు అడ్డుకట్ట వేయడం, మన మంతా హిందువులం, కులం మన ఇంటి వరకే పరిమితం-గడప దాటితే మన మంతా హిందూవులం. అనేభావన నిర్మాణ చేయడం, మన దేవాలయ వ్యవస్థను కాపాడుకోవడం, సమాజంలో సామాజిక సామరస్యతన ను నిర్మాణం చేయడం, కుటుంబ వ్యవస్థ బలోపేతం చేసుకోవడం మనందరి బాధ్యత. ఇదే ఈ హిందూ సమ్మేళనం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు శ్రీ జగద్గురు శ్రీమరి కొట్టూరు దేశకరు స్వామి, శ్రీ ఎం. బాల చంద్ర, మహిళ అతిథి శ్రీ హారిక మంజునాథ్ ధార్మిక ఉపన్యాసం, శ్రీ సురేంద్ర విభాగ ప్రచారక్ హాజరుకానున్నట్లు హిందూ సమ్మేళన నిర్వాహణ సమితి సభ్యులు తెలిపారు.

# ఇంటింటికీ వెళ్ళి చెత్త ను సేకరించాలి



**- హౌసింగ్ లే ఔట్ లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి**
**- ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు రాకూడదు**
**- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో** : గ్రామాల్లో తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్ళి చెత్త ను సేకరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.మంగళవారం మంత్రాలయం మండలం కేంద్రంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు.. ఈ సందర్భంగా రామచంద్ర నగర్ కాలనీలో పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, వీధి విద్యుత్ దీపాల సదుపాయాలపై కాలనీ వాసులతో ఆరా తీశారు..అనంతరం హౌసింగ్ లే ఔట్ ను పరిశీలించి, లబ్ధిదారులతో కలెక్టర్ సంభాషించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రామచంద్ర నగర్ కాలనీ వాసులతో మాట్లాడుతూ ఇంటింటి కీ వచ్చి చెత్త సేకరిస్తున్నారా, త్రాగునీటి సరఫరా ఎలా ఉంది, వీధి దీపాలు ఉన్నాయా అని కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు తెల్లవారుజామునే ఇంటింటికి వచ్చి పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరిస్తున్నారని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వారికి అందిస్తున్నామని, అదే విధంగా త్రాగు నీటి సమస్య, వీధి దీపాల సమస్యలు లేవని కాలనీ వాసులు కలెక్టర్ కి తెలియచేశారు.. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయించాలని కాలనీ వాసులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు..అనంతరం కలెక్టర్ మండల కేంద్రంలో ఉన్న హౌసింగ్ లే అవుట్ ను పరిశీలిస్తూ, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని లేఔట్ లో నివాసం ఉన్న వారిని ఆరా తీశారు.. త్రాగు నీటి సమస్య ఉందని, స్ట్రీట్ లైట్ లు, రోడ్డు వేయించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు..రోడ్డు వేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. త్వరితగతిన త్రాగు నీటి సమస్యను పరిష్కరించాలని, రెండు రోజుల్లో స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిపిఓ ను, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు..హౌసింగ్ లే ఔట్ లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హౌసింగ్ పీడీని ఆదేశించారు.. పాజిటివ్ పర్సెప్షన్ లో హౌసింగ్ అంశం పై ప్రజల నుండి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావాలిహౌసింగ్ అంశంపై ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ రావాలని కలెక్టర్ హౌసింగ్ ఇంజినీర్ లను, ఎంపిడిఓ ను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లను ఆదేశించారు.. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు రిజిస్టర్ లు మెయింటైన్ చేసి ఏ దశలో ఎంత డబ్బు జమ అయింది? సిమెంట్ కి ఎంత, స్టీల్ కి ఎంత డబ్బు జమ అయింది? అనే వివరాలను



రిజిస్టర్ లో నమోదు చేసి సంబంధిత లబ్ధిదారులతో సంతకం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.
ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిర్వహిస్తున్న రిజిస్టర్ ను కలెక్టర్ పరిశీలించి, నమోదు అంశంపై పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో , హౌసింగ్ పిడి చిరంజీవి, మంత్రాలయం నియోజకవర్గ మండల స్పెషల్ అధికారి/ డి పి ఓ భాస్కర్,మంత్రాలయం టీడీపీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆదోని ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి వసుంధర దేవి, మంత్రాలయం తహసిల్దార్ రమాదేవి, ఎంపిడిఓ నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు..

# ఏసునాథుని జన్మదినం.. మానవాళికి మహోదయం

**- ఇంచార్జీ కమిషనర్ (ఎఫ్ఏసి) ఆర్‌జివి కృష్ణ**
**- నగరపాలక సంస్థలో ముందస్తు క్రిస్మస్ కేక్ కటింగ్**




**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** ఏసునాథుని జన్మదినం మానవాళికి మహోదయంగా నిలిచిందని, ప్రేమ, శాంతి, సోదరభావాలకు ప్రతీకగా క్రిస్మస్ పండుగ ప్రపంచానికి సందేశం ఇస్తోందని నగరపాలక సంస్థ ఇంచార్జీ కమిషనర్ (ఎఫ్ఏసి) ఆర్‌జివి క్రిష్ణ అన్నారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కర్నూలు డయాసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ (కేడీఎస్ఎస్) అధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. సంస్థ ప్రతినిధులతో కలిసి ఇంచార్జీ కమిషనర్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగల సందర్భంలో పరస్పర గౌరవం, ఐక్యత మరింత బలపడుతాయని తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించడంలో క్రిస్మస్ పండుగ స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, నగర అభివృద్ధి కార్యక్రమాల్లో అన్ని వర్గాల సహకారం అవసరమని సూచించారు. నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, కేడీఎస్-ఎస్ సంస్థ ప్రతినిధులు టి.జోసెప్, తదితరులు పాల్గొన్నారు.

# నేర నివారణే లక్ష్యంగా పని చేయాలి

**- కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**
**- రౌడీషీటర్ల కదలికలపై జియో ట్యాగింగ్ ద్వారా నిఘా**
**- ల్యాండ్ మాఫియా, ఉద్యోగ మోసగాళ్లపై కఠిన చర్యలు**
**- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాల అందజేత**



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, నేర నివారణే ప్రథమ లక్ష్యంగా పోలీసు అధికారులు పని చేయాలని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో నిర్వహించిన వార్షిక నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**రౌడీషీటర్లపై నిఘా - జియో ట్యాగింగ్:**
రాష్ట్ర డిజిపి గారి ఆదేశాల మేరకు జిల్లాలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా



ఉంచాలని ఎస్పీ సూచించారు. జనవరి నుంచి ప్రతి రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్ల పూర్తి సమాచారాన్ని (ఫోటోలు, ఆధార్, బ్యాంక్ వివరాలు, ఫోన్ నంబర్లు) సిసిటీఎన్ఎస్ (%జజుచీూ%) లో అప్‌లోడ్ చేయడంతో పాటు, వారి లొకేషన్లను జియో ట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, అవసరమైతే జిల్లా బహిష్కరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కాగా, గత పదేళ్ళుగా ఎలాంటి కేసుల్లో పాత లేకుండా, సత్ప్రవర్తనతో ఉన్న వారిని రివ్యూ చేసి రౌడీషీట్ల నుంచి తొలగించాలని సూచించారు.

**నేరాల నియంత్రణ - బాధితులకు న్యాయం:**
ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగించే వారిపై మరియు ల్యాండ్ మాఫియాపై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. మహిళలపై నేరాలు, పోక్సో కేసులు, బాలికల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. దొంగతనం జరిగిన ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన ట్రయల్‌కు తెచ్చేలా కృషి చేయాలని, ప్రతి కేసులో 'ఈ-సాక్ష్య' యాప్‌ను విధిగా వినియోగించాలని సూచించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణ:**
జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రమాదకర ప్రాంతాలను (%దీశ్రీఖుషని ూజూశీం%) గుర్తించి, అక్కడ జిగ్ జాగ్ డ్రమ్స్, స్పీడ్ బ్రేకర్స్, బ్లింకర్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

**అవార్డుల ప్రధానం:**
ఉలిందకొండ పరిధిలో ఏటీఎం చోరీ యత్నాన్ని అడ్డుకుని, రాష్ట్ర డిజిపి గారి నుండి 'ఏబిసిడి' ( A B C D ) అవార్డు పొందిన పోలీసులను, గత నెలలో వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులను ఎస్పీ అభినందించి, వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.
ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, హేమలత, భార్గవి, పలువురు సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# సెలవు రోజుల్లో సైతం పన్నులు చెల్లించవచ్చు

**-నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు**
**- వడ్డీ లేకుండా ఆస్తిపన్ను చెల్లించేందుకు ఇంకా 8 రోజులే**



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో :** సెలవు రోజుల్లో సైతం నగరపాలక సంస్థకు సంబంధించిన పన్నులను చెల్లించే సౌకర్యం కల్పించామని నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు తెలిపారు. మంగళవారం ఆయన పన్ను వసూళ్ల కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. వడ్డీ లేకుండా ఆస్తిపన్ను చెల్లించేందుకు ఇంకా కేవలం ఎనిమిది రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆస్తిపన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. క్రిస్మస్, ఆదివారం వంటి సెలవు రోజుల్లో సైతం కౌంటర్లు, ఆన్‌లైన్ విధానం ద్వారా పన్నులు చెల్లించవచ్చని సూచించారు. గడువు ముగిసిన అనంతరం వడ్డీ విధించబడుతుందని, అందువల్ల ఆలస్యం చేయకుండా పన్నులు చెల్లించాలని కోరారు. నగర అభివృద్ధి కార్యక్రమాలకు పన్నులే ప్రధాన ఆధారమని, ప్రతి పౌరుడు బాధ్యతగా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలి



**నంద్యాల . డిసెంబర్ 23 . (పల్లె వెలుగు ):**శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నంద్యాలలో "క్యాంపస్ దాటి: పూర్వ విద్యార్థుల అంతర్దృష్టులు అనుభవాలు" అనే అలుమ్ని టాక్స్ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్యంగా ప్రసంగిస్తూ, విద్యార్థులు తరగతి గదిలో పొందే జ్ఞానంతో పాటు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పూర్వ విద్యార్థుల అనుభవాలు ప్రస్తుత విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగాధిపతి డా. ఎన్. రమాదేవి మార్గదర్శకత్వంలో నిర్వహించబడిందని తెలిపారు.విద్యార్థులు పరిశ్రమతో అనుసంధానమయ్యేలా ఇలాంటి అవగాహన



కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి ఏ. వెంకట సాయి కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని, తన విద్యా ప్రయాణం, ఉద్యోగ అనుభవాలు, కెరీర్ ఎంపికలు, నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌ల ప్రాధాన్యతపై విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. క్లాస్‌రూమ్ నుండి కార్పొరేట్ ప్రపంచానికి వెళ్లే ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో వివరించారు.ఈ కార్యక్రమాన్ని %బా% స్టూడెంట్ బ్రాంచ్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ సొసైటీ ఆధ్వర్యంలో, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగం సహకారంతో నిర్వహించారు. ముఖ్యంగా ఐఐఐ బీటెక్ సిఎస్ఇ (డేటా సైన్స్) విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరిశ్రమకు అవసరమైన టెక్నికల్ మరియు సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన పొందారు.ఈ కార్యక్రమం ద్వారా కళాశాల%-%అలుమ్ని మధ్య అనుబంధం మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపకులు,విద్యార్థి సభ్యులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

## ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆర్ జె డి శామ్యూల్



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 22:** విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ శామ్యూల్ మంగళవారం బండి ఆత్మకూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన వెంట డోంట్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి శంకర్ ప్రసాద్ తో పాటు వెంకట్రామిరెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో ఆర్జెడి మాట్లాడారు. వారి విద్యా స్థాయి ల గురించి వాకప్ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వందరోజుల ప్రణాళికను విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకొని కష్టపడి చదివి 100% ఉద్దీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ఆర్జెడి తనిఖీ చేసిన అనంతరం గ్రామంలోని వీవర్స్ కాలనీలోని మోడల్ ప్రైమరీ స్కూల్లో జి ఎఫ్ ఎల్ ఎన్ ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూర్జహాన్ తో పాటు మండల విద్యాశాఖ అధికారి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## సేవలకు సత్కారం



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 22:** వ్యవసాయ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను బండి ఆత్మకూరు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ కు సత్కారం లభించింది. జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమంలో భాగంగా జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో ఉత్తమ సేవలు అందజేసిన అధికారులను సన్మానించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలంలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న పవన్ కుమార్ ను రాయలసీమ వ్యవసాయ జాయింట్ కలెక్టర్ ఉమామహేశ్వరమ్మ జై కిసాన్ ఫౌండేషన్ అధినేత ఓబులేసు ఘనంగా సన్మానించి సత్కరించారు రైతులకు అనుబంధంగా ఉన్న శాస్త్రవేత్తలు వ్యవసాయ విస్తరణ అధికారులు జర్నలిస్టులను కూడా కమిటీగా ఏర్పాటు చేసి సన్మానించారు ఉత్తమ మండల వ్యవసాయ అధికారిగా సేవలందించిన పవన్ కుమార్ ను పలువురు అధికారులు అభినందించారు.

## లీకు ల గురించి పట్టించుకోరా!



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 22:** బండి ఆత్మకూరులో రక్షిత మంచినీటి సరఫరా పథకానికి సంబంధించిన పైపులైన్లకు లీకులు ఏర్పడ్డాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 100 మీటర్ల దూరంలోనే తొమ్మిది లీకులు ఏర్పడ్డాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దాదాపు రెండు నెలల కాలం నుండి పైపులైన్లకు లీకులు ఏర్పడినప్పటికీ వాటిని మరమ్మతు చేయడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బండి ఆత్మకూరు లోని సంత గేటు ప్రాంతంలో ఉన్న కొట్టం నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఈ లీకులు ఏర్పడ్డాయి. దీని వల్ల నీరు కలుషితమై రోగాలు బారిన పడతామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకులను వెంటనే మరమ్మతు చేయించాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జిల్లాను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలి

- పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.

- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.






**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 24 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో చాలెంజ్ బేస్ డేస్టినేషన్ కింద అహోబిలంలో రూ.25 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక ప్రాంతాలు, వాటి యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెలవు దినాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈఓ కు సూచించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల ఆనందంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చునన్నారు.

అహోబిలం, శ్రీశైలం, మహానంది, బెలూన్ కేవ్స్ లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలనిఅక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే సిసి కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచి యాత్రికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి తీసుకున్న చర్యలు, ఇంకను చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా టూరిజం అధికారి, డీఈవో జనార్దన్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కురువలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

### – టీడీపీ యువ నేత మంజునాథ్ గౌడ్



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 23 :** కురువలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి యువనేత మంజునాథ్ గౌడ్ అన్నారు. అనంతరం మంజునాథ్ గౌడ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో రాజకీయం ప్రభావితం చెయ్యగలగిన స్థాయిలో ఆరు లక్షల మంది కురువ కులస్తులు ఓటర్లుగా కలిగి ఉన్నామని,అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది కురువ కులస్తులు ఓటర్లుగా కలిగి ఉన్నామని అన్నారు. కానీ మా కురువ కులస్తులకి జిల్లాలో ఎటువంటి నామినేటెడ్ పోస్టులో ప్రాధాన్యత కేటాయించలేదని , మొన్న కూటమి ప్రభుత్వం 25 జిల్లాలకు పార్లమెంట్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను టీడీపీ అధిష్టానం ప్రకటించింది, కానీ అందులో ఒక్కరి కూడా కురువ కులస్తులు లేదని,నాటి నుంచి నేటి వరకు చూసుకుంటే కురువ కులస్తులకు ఒక ఓటు వేసే యంత్రంలా ఉపయోగించుకుంటున్నారు, తప్ప ఒక మనిషిలా కూడా చూడటం లేదని మంజునాథ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కురువలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే కురువలుఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, అభివృద్ధి సాధించగలమని అన్నారు. ఆలూరు తాలూకాలో ఒకటే 65,000 మంది కురువ కులస్తులు ఓటర్లుగా కలిగి ఉన్నామని దానిని టీడీపీ అధిష్టానం దృష్టిలో పేట్టుకొని రేపు జరగబోయే గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలక్షన్లో, కాని ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కురువలకు అత్యధికంగా ప్రాధాన్యత, స్థానాలను కేటాయించాలని టిడిపి అధిష్టానానికి మంజునాథ్ గౌడ్ డిమాండ్ చేశారు.

## చేసిన పనులకు బిల్లులు పొందాలంటే లోకల్ ట్యాక్స్ కట్టలా?

### – మండల సమావేశంలో కొండాపురం సర్పంచి మాధవీ మండిపాటు

### –మూడేళ్లుగా గౌరవ వేతనాలు అవ్వడం లేదని అర్జునాపురం' ఎంపీటీసీ సావిత్రి నీలదీత



దొర్నిపాడు పంచాయతీల్లో చేస్తున్న చేసిన పనులకు బిల్లులు పొందాలంటే లోకల్ టాక్స్ కట్టాలా? అని మండల సమావేశంలో కొండాపురం సర్పంచ్ మాధవి అధికారులు ప్రశ్నించారు,పనులు చేసింది కాకకమిషన్లు అంటూ వేదిస్తే సర్పంచులు ఏ గంగలో దూకాలంటూ కొండాపురం సర్పంచి మాధవీలత మండి పడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అమర్ నాథ్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పైపులైన్లు మరమ్మతులు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు ఇలా పంచాయతీల్లో అనేక పనులు చేశాం. బిల్లులు పెట్టాలంటూ అధికారులను అడిగితే మోహం చాటేయడం ఏంటని ప్రశ్నించారు. గట్టిగా నిలదీస్తే మాదేముంది మీరు టాక్స్ లుచెల్లిస్తే సరిపోతుందికదా బిల్లులు వస్తాయని జవాబు ఇస్తున్నారని చెప్పే స్థాయికి వస్తున్నారు. మా డ్యూటీ ఎం చేస్తున్నాం. బిల్లులు పెడతాం అని అధికారులు ఎందుకు చెప్పలేక పోతున్నారు. మహా అయితే ట్రాన్స్ఫర్ అవుతారు అంతేకదా అన్నారు. ఇలా అందరికీ కమిషన్లు ఇచ్చుకుంటూ పోతే మేము ఉన్న ఆస్తులు అమ్ముకోవాలా అని సభలో అధికారులను నిలదీశారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని అర్జునాపురం ఎంపీటీసీ సావిత్రి అధికారులను అడిగారు. అందుకు ఎంపీడీఓ సావిత్రి స్పందిస్తూ ప్రతి నెలా బిల్లులు పెడుతున్నామని అందుకు సంబంధించిన బిల్ నంబర్లు కూడా ఉన్నాయన్నారు. ప్రభుత్వం బడ్జెట్ విడుల చేసిన వెంటనే వారి వ్యక్తిగత ఖాతాలకు జమ అవుతాయన్నారు. మండలంలో గుండుపాపల, దొర్నిపాడు-2లో గ్రామాల్లో వెల్నెస్ సెంటర్లు మంజూరు అయ్యాయని వైద్యాధికారి రుహుల్లాఖాన్ అన్నారు. నిర్మాణాలకు కావాల్సిన స్థలాలను చూపాలని తహసీల్దార్ సుభద్రకు సూచించారు. ఒక్కో సెంటర్ నిర్మాణానికి రూ.35 లక్షల వరకు నిధులు విడుదల అవుతాయన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్తు పోదుపుగా వాడుకోవాలని, సూర్యఘర్ను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ రామోహన్ అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సావిత్రి తాసిల్దార్ సుభద్ర ,జడ్పిటిసి శకుంతలమండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు

## కలెక్టర్ మేడం నా కిడ్నీలు అమ్ముకొని నా తల్లిదండ్రులను బ్రతికించుకుంటా

### – తల్లిని ఎత్తుకోని నడవలేని తండ్రిని చూపుతున్న కొడుకు

### – వినతి పత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ సావిత్రి




**దొర్నిపాడు డిసెంబర్ 23 పల్లి వెలుగు న్యూస్ :** కలెక్టర్ మేడం మా తండ్రికి బ్రెయిన్ స్ట్రోక్ తో కాళ్లు చేతులు చచ్చుపడ్డాయి మా తల్లికి టీవీ క్యాన్సర్ తో కాళ్లు,చేతులు పనిచేయక మంచం పట్టారు, వీరిని బ్రతికించుకోవడానికి నా కిడ్నీలు అమ్ముకుని బ్రతికించుకుంటాను అని అధికారుల ముందట ఆవేదన వ్యక్తం చేశారు, మీడియాతో బాధితుడుఅన్వర్ భాష మాట్లాడుతూ మానాన్న మహబూబ్ బాషా బ్రేయిన్ స్ట్రోక్ వచ్చి కాళ్లు, చేతులు చచ్చుబడ్డాయి. పింఛన్ మంజూరు కోసం రెండేళ్లపాటు సదరం క్యాంప్ చుట్టు తిరుగుతున్నా ఎవరూ స్పందించడం లేదు. మా అమ్మ హమిదాబి ఏడాది నుంచి టీవీ సోకడంతో రెండు కాళ్లు పనిచేయక మంచం పట్టారు. నాకు గతంలో రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి రాడ్లు వేశారు. వాటి సాయంతో పాలిష్ కటింగ్ పనులు చేసుకుంటూ భార్య ఇద్దరు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఇక నాకు ఓపిక లేదు. నాకున్న కిడ్నీలుఅమ్ముకొని మా అమ్మనాన్నలను పోషించాలనుకుంటున్నాను అంటూ మంగళవారం కార్యాలయం ఎదుట కన్నీటి పర్యంతం అయ్యాడు. ఇద్దరిలో ఎవరో ఒకరికి పింఛన్ మంజూరు చేయాలంటూ వేడుకున్నారు. వారి బాధను చూసి చలించిన ఎంపీపీ అమరేనారెడ్డి, జెడ్పీటీసీ శకుంతల మండల సర్వసభ్యసమావేశం నుంచి బయటకు వచ్చారు. వెంటనే ఎంపీడీవో సావిత్ర, తహసీల్దార్ సుభద్ర, వైద్యాధికారి రుహుల్లాఖాన్ కు పిలిపించి వీరు పింఛన్ పొందేలా చర్యలు తీసుకో తీసుకోవాలని ఆదేశించారు. అర్హత ఉన్న వారికి పెంషన్ ఇవ్వండి. వారి పనిస్థితి చలించేలా ఉందన్నారు. ప్రస్తుతం కలెక్టర్లకు జిల్లాకు 200 పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది కదా వాటిలో ఒకటి ఈ కుటుంబానికి వచ్చేలా చూడాలని అధికారులను కోరారు. వైద్యపరీక్షలు చేసినా వీరికి అర్హత ఉందన్నారు, సదరం క్యాంప్ వారు వైద్యపరీక్షలు చేసేందుకు డేటు ఇచ్చి ఎందుకు నిరాకరిస్తున్నారని ఎంపీపీ అధికారులను అడిగారు. కలెక్టర్లు వీరి విషయం పూర్తిగా వివరించాలని అధికారులకు సూచించారు. వీరికి ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం పింఛన్ వచ్చేలా చూస్తామని అన్నారు

# టిడిపి క్రైస్తవ నాయకులకు యేసుప్రభు వాక్యాన్ని బహుకరించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.




**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ఈరోజు నంద్యాలలోని వారి క్యాంపు కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రముఖ క్రైస్తవ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాజీ కౌన్సిలర్ కృపాకర్, మాజీ కౌన్సిలర్ దేవరపాటి రవికుమార్ దంపతులకు మరియు 38వ వార్డు టీడీపీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు కు మంత్రి ఫరూక్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, పవిత్ర బైబిల్ గ్రంథంలోని "ప్రభువు వాక్యాన్ని" బహుకరించారు .

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సమాజంలో సోదరభావాన్ని, శాంతిని పెంపొందించడంలో క్రైస్తవ పెద్దల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. తమను సాదరంగా ఆహ్వానించి, గౌరవించినందుకు క్రైస్తవ నాయకులు మంత్రి ఫరూక్ కి కృతజ్ఞతలు





# నూతన సర్పంచులకు ఘన సన్మానం.

**వెల్దండ డిసెంబర్ 23 పల్లె వెలుగు దినపత్రిక:** వెల్దండ మండలంలోని వివిధ గ్రామాలలో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ లను ఘనంగా సన్మానించడం జరిగింది. మండల పరిధిలోని బండోనిపల్లి గ్రామ సర్పంచ్ ఎనుముల సంగీత శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ వావిళ్ళ అల్వాల్ యాదవ్ లను బొల్లంపల్లి మాజీ ఎంపిటిసి చల్ల వెంకట్ రెడ్డి, బొల్లంపల్లి సర్పంచ్ ప్రసాద్ గౌడ్ ల ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో సత్కరించి , పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం.. బండోనిపల్లి గ్రామస్తులు బొల్లంపల్లి సర్పంచ్ ప్రసాద్ గౌడ్ ను మా గ్రామ మాజీ సర్పంచ్ సందమల్ల అంజయ్య, ఇస్లావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో బండోనిపల్లి గ్రామ యువకులు సత్తూరి సాయిబాబా గౌడ్, ఏకుల జగన్, రామకృష్ణ మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు. అదేవిధంగా.. మండలంలో వివిధ గ్రామాలలో గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ శంకర్ నాయక్ సన్మానించారు. వెల్దండ గ్రామ ఉపసర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్ ను, నారాయణపూర్ గ్రామ సర్పంచ్ బానావత్ తారా సింగ్ ను, శంకర్ కొండ సర్పంచ్ రవీందర్ నాయక్, మరి గుంత తండా సర్పంచ్ భాగ్యమ్మ ఫూల్ సింగ్ నాయక్, గోపి నాయక్ లను శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చల్ల వెంకట్ రెడ్డి, బొల్లంపల్లి ఉపసర్పంచ్ రామకృష్ణ, యాదయ్య, శ్రీనివాస్ చారి, కానుగుల పర్వతాలు, బాణావత్ శంకర్ నాయక్, మాజీ డైరెక్టర్ రవీందర్ నాయక్, గిరిజన నాయకులు లక్ష్మణ్ నాయక్, నర్సింగ్ నాయక్, రవీందర్ నాయక్, యువ నాయకులు పకాడి రామాంజనేయులు, వినోద్ కుమార్, కొమ్ము రవి, జక్కుల పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉన్నత విలువలకు ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

## మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య.

**మహానంది, పల్లె వెలుగు**

ఉన్నత విలువలకు ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని మండల విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య, పేర్కొన్నారు. మంగళవారం మహానందిలోని రామకృష్ణ విద్యాలయంలో పిటి ఉపాధ్యాయులుగా 38 సంవత్సరాలు పనిచేసి పదవీవిరమణ చెందిన ఎస్వీ కృష్ణయ్య, శ్రీలక్ష్మి దంపతులను ఎస్వీఆర్ కల్యాణ మండపంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను అభినందించారు. అనంతరం చిన్నారులు కోలాట ప్రదర్శనలు చేసి అలరింపజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-2 విజయకుమార్, పాఠశాల కరస్పాండెంట్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# మహానంది దేవస్థానానికి రూ. 1.14 లక్షల ఆదాయం





**మహానంది, పల్లె వెలుగు**

మహానంది దేవస్థానానికి వేలాల ద్వారా రూ. 1.14 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో ఎన్. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం పోచా బ్రహ్మానందరెడ్డి విశ్రాంతి భవనంలో వేలాలు నిర్వహించారు. రెండు ఖాళీ స్థలాలకు వేలం నిర్వహించగా 43వ ప్లాటు వివేకానందరెడ్డి రూ. 30 వేలు, 44వ ప్లాటు రూ. 29 వేలలతో భూమాశంకరయ్యలు దక్కించుకున్నారని తెలిపారు. అదే విధంగా చింతఫలసాయాన్ని రూ. 25 వేలకు, పడిపోయిన చెట్లకు రూ. 30 వేలకు రంగస్వామి దక్కించుకున్నారన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ లోని వ్యాపార దుకాణాలకు నిర్వహించాల్సిన వేలాలకు డిపాజిట్లు ఎవరు చెల్లించకపోవడంతో వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ వేళాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మహానంది ఎస్ఐఎన్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు, పర్యవేక్షకులు శశిధరరెడ్డి, నీలకంఠరాజు, ప్రోటోకాల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

# ...ఎంపీ బస్తిపాటి నాగరాజు నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ ,కరుణ , త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు.. కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ఎంపీ నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు..వేడుకలలో భాగంగా ఎంపీ నాగరాజు కేక్ కట్ చేసి జిల్లాలోని క్రైస్తవ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు... అనంతరం ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు.. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరారు...ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు...

# ఎమ్మిగనూరు వైసిపి ఇన్చార్జిగా బుట్టా రేణుక ను నియమించాలి

## అన్ని వర్గాల వారు బుట్ట రేణుక వెంటే ఉన్నారు

## వైసీపీ నాయకులు తిమ్మాపురం బజారి

**ఎమ్మిగనూరు, పల్లె వెలుగు డిసెంబర్ 23**



ఎమ్మిగనూరు సమయకర్తగా బుట్టా రేణుక కే కేటాయించాలని వైఎస్ఆర్సిపి నాయకులు కే తిమ్మాపురం బజారి అన్నారు. కే తిమ్మాపురం వైసిపి నాయకులు బజారి మాట్లాడుతూ, ప్రజాధరణ పొందిన వ్యక్తిగా బిసి మహిళా బుట్టా రేణుక నాయకత్వంతో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నందవరం మండలం 80% ఎమ్మిగనూరు టౌను 90% గోనెగండ్ల 60% ఎమ్మిగనూర్ మండలం 50%బుట్టా రేణుక గారికి పూర్తి మద్దతుగా ఉందని అన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆలోచన చేసి బుట్టా రేణుక,కి ఎమ్మిగనూరు సమన్వయ కర్తగా కేటాయించాలని తెలిపారు. బుట్టా రేణుక కి టికెట్ కేటాయిస్తే కుర్ని సామాజిక వర్గం మైనార్టీలు దళితులు బీసీలు రేపు వచ్చే ఎన్నికలలో ఎమ్మిగనూరులో భారీ మెజార్టీతో గెలిపిస్తామని, అలాగే బీసీ మహిళ కాబట్టి తప్పకుండా విజయం సాధిస్తారని తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం : పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**పల్లె వెలుగు కర్నూల్ రిపోర్టర్ :**

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఈ మేరకు నన్నూరు గ్రామానికి బోయ సుహాసిని 36,000 రూ. మహబూబ్ భాష 37,000 రూ. పింజిరి ఫక్రుద్దీన్ 32,500 రూ. వారు అనారోగ్యంగా బాధపడునందున వారికి గ్రామ నాయకులు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు , నారా లోకేష్ బాబు కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ నాయకులు శ్రీ బోయినపల్లి విశ్వేశ్వర రెడ్డి , పాణ్యం బిసి సెల్ ఉపాధ్యక్షులు శ్రీ తలారి విజేయుడు , తెలుగు దేశం పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ కటిక హాసన్ , పార్టీ నాయకులు, సర్కార్ హుస్సేన్ , శ్రీపతి బుజ్జప్ప , మొల్ల మాబు ,పట్టేల మెహన్ , కృష్ణుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాణ్యం పులిబిడ్డ.. కాటసాని శివ నరసింహా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనం







## జిల్లా వ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు..
## వీడియో కాల్ ద్వారా కేక్ కట్ చేసిన కేఎస్ఎన్ఆర్ (KSNR)
## ఎద్దుల శివారెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు..
## తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు.

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు, యువనేత కాటసాని శివ నరసింహా రెడ్డి (%ఖూచీ=%) జన్మదిన వేడుకలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా పండగ వాతావరణంలో అత్యంత ఘనంగా జరిగాయి. వైఎస్ఆర్సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దుల శివారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

### వీడియో కాల్ ద్వారా సంబరాలు:

పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నివాసం వద్ద ఎద్దుల శివారెడ్డి మరియు మిత్రబృందం భారీ కేక్ సిద్ధం చేశారు. యువనేత శివ నరసింహా రెడ్డి అందుబాటులో లేనప్పటికీ, ఆయనకు వీడియో కాల్ చేసి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నేతల కోరిక మేరకు కేఎస్ఎన్ఆర్ వీడియో కాల్‌లోనే కేక్ కట్ చేసి అభిమానులను



ఉర్రూతలూగించారు.

### తరలివచ్చిన శ్రేణులు:

ఈ సందర్భంగా ఎద్దుల శివారెడ్డి మాట్లాడుతూ.. కాటసాని వారసుడిగా, పాణ్యం పులిబిడ్డగా శివ నరసింహా రెడ్డి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ అనుబంధ విభాగాల జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు, కీలక నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, వేలాది మంది కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని తమ ప్రియతమ నేతకు శుభాకాంక్షలు వెల్లువలా కురిపించారు.







## ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ శ్రీ శ్రీ నీలకంఠేశ్వర స్వామి,,,,, దేవాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుక,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 23

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో పులకరించింది. అనంతరం జనవరి 5వ తేదీన ఘనంగా జరగబోయే నీలకంఠేశ్వర స్వామి మహా జాతర రథోత్సవాన్ని పురస్కరించుకుని రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఈ మహోత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించబడాలని, ఎమ్మిగనూరు ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, సుఖసమృద్ధులు కలగాలని స్వామివారిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ డి. నజీర్ అహమ్మద్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్. రామకోటేశ్వర్ రెడ్డి, ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, చేనేత జిల్లా అధ్యక్షులు ఎం.కె. శివప్రసాద్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దొరబాబు నాయుడు, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యకర్గ సభ్యులు కోరిశెట్టి మధుబాబు, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, నియోజకవర్గ చేనేత అధ్యక్షులు మీసాల బంద శివ నీలకంఠ, నందవరం మండల డాక్టర్ విభాగ అధ్యక్షులు నరహరి రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు లతా రెడ్డి, పట్టణ యువజన విభాగ అధ్యక్షులు బోయరాజు, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, పట్టణ ప్రధాన కార్యదర్శులు గడ్డం అంజి, కరే రాము, పట్టణ కార్యదర్శులు గురువ మా భాష, జెరుబండి రఘువీర, 2వ వార్డు ఇంచార్జ్ చంద్ర మాజీ కౌన్సిలర్ మల్లీ, దైవంనిన్నే నాగరాజు, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి బోయ బజారి, మిట్ట సోమాపురం నరసింహులు, కోటేకల్ పాపన్న, ఇబ్రహీం, తిమ్మాపురం వీరాంజనేయులు, బనవాసి ఫారం రాజ్ కుమార్, కనకవీడు చంద్రశేఖర్ ఆచారి, రవి కుమార్, బండారి యోహాను, బండారి అనూక్, కదిరికోట ప్రేమ్ సాగర్, బండారి చక్రవర్తి, నెరడుప్పల బూత్ అధ్యక్షులు ఉసేనప్ప, పట్టణ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు మంజునాథ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు అభివృద్ధి ఆదోని జిల్లా తోనే సాధ్యం

## 14 వ రోజు రిలే నిరహార దీక్షలకు మద్దతుగా,,,,,,
## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు వై, ధరణిధర్ రెడ్డి ,,,,,,,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 23

ఆదోని జిల్లా సాధన జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు 14వ రోజున సంపూర్ణ మద్దతు తెలియజేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు వై ధరణిధర్ రెడ్డి, దీక్షలో కూర్చున్న విద్యార్థి యువజన ప్రజాసంఘాల నాయకులు శేఖర్, ఆఫ్రిది,గణేష్, సత్యారెడ్డి ఉదయ్ , కాజా , మహేంద్ర , రఘు, కృష్ణ , ఎల్లప్ప , బతకన్న లకు పూలమాలలు వేసి ఆదోని జిల్లాకు తన సంపూర్ణ మద్దతు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతం అయినటువంటి ఆదోని ని జిల్లాగా ప్రకటిస్తే మన ఎమ్మిగనూరు నియోజకవర్గం కూడా అన్ని రకాలుగా ముందంజలో అభివృద్ధి లో ఉంటుందని మనకు కూడా ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని ఆదోని జిల్లా అయితే మన ఎమ్మిగనూరు కూడా అభివృద్ధి జరుగుతుందని , మరియు కొంతమంది ఎమ్మిగనూరులో భూములు ఉన్నాయని అంటున్నారు కానీ ఇక్కడ ఇలాంటి అభివృద్ధి లేదు మన కర్నూలు జిల్లా ఏర్పడినప్పుడు ఆదోని డివిజన్ ఏర్పడిందని అప్పటినుండి ఏదైనా కార్యకలాపాలు మనకు అందుబాటులో ఉన్నాయంటే అది



ఆదోని నుండి మనం కొన్ని పనులు చేసుకుంటున్నామని, మన పూర్వీకులు చేసిన అభివృద్ధి తప్ప ఇప్పుడు ఎలాంటి అభివృద్ధి ఏ నాయకుడు చేయలేదని కావున ఆదోని సబ్ డివిజన్ గా ఇప్పుడు ఉంది కాబట్టి ఆదోని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని వారు అంటున్నారు అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయి మనకు ఆదోని జిల్లా ఏర్పాటు అయితే ఎమ్మిగనూరు మంత్రాలయం పత్తికొండ ఆలూరు ప్రాంతాలు కూడా ఆదోని జిల్లాతో అభివృద్ధి జరిగి విద్యా, వైద్యం ,తాగు ,తాగునీరు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు , ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఇక్కడే ఉపాధి అవకాశాలు వస్తాయని కావున ఆదోని జిల్లాకు తన సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానాని దానితోపాటు ఎమ్మిగనూరు అభివృద్ధిని కూడా కోరుకుంటున్నాను అని ఆయన చెప్పడం జరిగింది , ఈ కార్యక్రమంలో యూసోపు ,సత్తన్న ,విష్ణు ,అనిల్ రఘురాం, తదితరులు పాల్గొన్నారు

# డంపింగ్ యార్డ్ ని ఎత్తివేయాలి..

ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్. ఈరేష్..

కోసిగి, డిసెంబర్ - 23 (పల్లెవెలుగు): మండలానికి విసిట్ కోసం వచ్చిన జిల్లా కలెక్టర్ కి ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్. ఈరేష్ మాట్లాడుతూ కోసిగి మండల కేంద్రంలో ఉన్న ఇంటిగ్రేడ్ హాస్టల్ నెలకొన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో హాస్టల్ వార్డెన్ పూర్తిగా విఫలం చెందారు. అదేవిధంగా ఇంత పెద్ద హాస్టల్లో వర్కర్స్ అవసరమైతే ఉన్న వర్కర్స్ డిప్యూటేషన్ పై ఇతర ప్రాంతాలకు పంపించారు. హాస్టల్ కు వాచ్మెన్ ఉన్న హాస్టల్ కు అస్సలు రావడం లేదు అదేవిధంగా విద్యార్థులకు టిఫిన్,భోజనం సక్రమంగా మెనూ ప్రకారంగా పాటించడం లేదు. ప్రతిరోజు వండిన వంటలనే హాస్టల్ వార్డెన్ వండిస్తున్నారు హాస్టల్ విద్యార్థుల కోసం వాచ్ మెన్ ఏర్పాటు చేస్తే డ్యూటీ





చేయకుండా బయట వ్యక్తిని పెట్టి వాచ్మెన్ గా కొనసాగుతున్నాడు. అంతేకాకుండా హాస్టల్లో వంట పని చేస్తున్న వారి స్థానంలో ఇతర వ్యక్తులు వచ్చి వంటలు వండుతున్నారు. ఇదేంటి సార్ అనే విద్యార్థి సంఘం గా ప్రశ్నిస్తే చూసి చూడనట్టు ఉండాలి మీరు అంటున్నాడు తక్షణమే విచారణ చేసి హాస్టల్ వార్డెన్ సస్పెండ్ చేయాలి అదేవిధంగా వివిధ గ్రామాలలో ప్రభుత్వ బడులు నిర్మాణంలో నాణ్యత పాటించకుండా ఇష్టం వచ్చినట్టు ఒక బస్తాకు 60 గంపల ఇసుకను కలిపి నాణ్యత లేకుండా బడులు నిర్మిస్తున్నారు కొన్ని నెలలు గడువక ముందే పెచ్చులూడి పడుతున్నాయి కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి విద్యార్థుల బలవుతున్నారు కేజీబీవీ జూనియర్ కళాశాల నాణ్యతకు లేకుండా రేకుల షెడ్డు వేస్తూ విద్యార్థుల ప్రాణాలతో కాంట్రాక్టర్ ఆడుకుంటున్నాడు. తక్షణమే కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలి పాఠశాల నిర్మాణ చేపడుతున్న పాఠశాలలకు అధికారులు వెళ్లి పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కు సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు పురుషోత్తం, అజయ్, వంశీ, రవి, నాయక్, వీరన్న, సంతోష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తుడికి అధిక ప్రాధాన్యత



















ఇంజనీరింగ్ పనులు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించిన దేవదాయశాఖ కమిషనర్

క్షేత్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

సామాన్య భక్తుల సౌకర్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.

ప్రతీ ఉద్యోగి కూడా భక్తులతో మర్యాదగా మెలగాలి.

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదు.

శివసేవకుల స్వచ్ఛందసేవను విరివిగా వినియోగించుకోవాలి.

అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఇంజనీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలి.

నిర్మాణంలో పూర్తి నాణ్యతా ప్రమాణాలను పాటించాలి.

రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్

**పల్లె వెలుగు శ్రీశైలం...**

శ్రీశైలక్షేత్రంలో రోజురోజుకు పెరుగుతున్న భక్తులరద్దీకనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ శ్రీ కె. రామచంద్రమోహన్ అన్నారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యాల కల్పన, క్షేత్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలను సమీక్షించి పలు ఆదేశాలు ఇచ్చారు.కమిషనర్ శ్రీశైల క్షేత్రానికి విచ్చేసి దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. అదేవిధంగా ఈ సాయంకాలం పరిపాలనా కార్యాలయ భవనంలోని సమావేశమందిరంలో అన్ని విభాగాల అధిపతులు మరియు పర్యవేక్షకులతో సమావేశమై దేవస్థాన పరిపాలనా అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు సదుపాయల కల్పనకై చేపట్టవలసిన అన్ని చర్యలను వెంటనే చేపట్టాలన్నారు.

సామాన్య భక్తుడికి అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా ఆలయ నిర్వహణ ఉండాలన్నారు. క్షేత్రానికి విచ్చేసే ప్రతీ భక్తుడు సంపూర్ణంగా తన యాత్ర ఫలవంతమైందనే తృప్తి కల్పించాల్సిన బాధ్యత దేవస్థానం సిబ్బంది, అధికారులపై ఉందన్నారు. భక్తుల మనోభావాలను, వారి విశ్వాసాలను గౌరవిస్తుండాలన్నారు. ఈ ఉదయం ముందుగా దేవస్థానం అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సమీక్షలో ఇటీవల పూర్తయిన పనులు, ప్రస్తుతం చేపట్టిన పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనుల గురించి అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత్కాలిక క్యూ కాంప్లెక్సు నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మూడు మాసాలలోగా నిర్మాణ ప్రక్రియ ప్రారంభమయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోవు 30 సంవత్సరాలలో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకుని శాశ్వత క్యూ కాంప్లెక్సు నిర్మాణ ప్రణాళిక ఉండాలన్నారు.అదేవిధంగా ఆలయముందుభాగంలో గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు గల ప్రధానవీధి సుందరీకరణకు, ప్రధానవీధిలో సాలుమండపాల నిర్మాణానికి సంబంధించి కొన్ని సూచనలు చేశారు. వాటి నిర్మాణం కొరకు వెంటనే చర్యలను ప్రారంభించాలన్నారు.సామాన్య భక్తులకు వసతి కల్పించేందుకు గణేశసదనం వద్ద మరో సత్రనిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఏటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో విచ్చేసే శివదీక్షా భక్తుల సౌకర్యార్థం శివదీక్షా శిబిరాలలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.

అనంతరం ప్రధానాలయంలోని ప్రాచీన కట్టడాలను పరిశీలించారు. ఆలయంలోని నందిమండపం, వృద్ధమల్లికార్జునస్వామి ఆలయ ముఖమండపం, అమ్మవారి ఆలయ ప్రవేశద్వారమండపం పరిశీలించారు. అవసరమైతే వీటికి తగు మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలగకుండా ఈ మరమ్మతులు ఉండాలన్నారు. అమ్మవారి ఆలయంలో ఉత్తరం వైపున నిర్మించతలపెట్టిన ప్రాకార మండపం పనులు త్వరితంగా పూర్తి చేయాలన్నారు.ఆలయ మహాద్వారం ముందు ప్రస్తుతం ఉన్న రేకుల పైకప్పుస్థానంలో రాతి మండప నిర్మాణానికి ప్రతిపాదనలను రూపొందించాలన్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగాను మరియు క్షేత్రసుందరీకరణకు క్షేత్రంలో విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ముఖ్యంగా కదంబం, బిల్వం, రావి మొదలైన దేవతా వృక్షాలను అధికంగా నాటాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రధానమైన చోట్ల సుందరీకరణ మొక్కలను పెంచాలన్నారు. అదేవిధంగా అవకాశం ఉన్నచోట వర్టికల్ గార్డెన్లను ఏర్పాటు చేయాలన్నారు.అనంతరం ఆయా పరిపాలనాంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ముందు దేవస్థాన జమాఖర్చులను పరిశీలించారు.

తరువాత దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాదవితరణ, గోసంరక్షణ,పరిపాలనా, ఆడిట్, అకౌంట్స్, ప్రసాదాలు, పారిశుద్ధ్యం మొదలైన అంశాలను సమీక్షించారు.ఇంకా వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యాల కల్పనలో భాగంగా శివసేవకుల స్వచ్ఛందసేవను విరివిగా వినియోగించు కోవాలన్నారు. స్వచ్ఛందసేవకులు ఆలయంలో ఆయా సేవలు అందించేందుకు దేవస్థాన వెబ్సైట్ నందు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయాన్ని మరింతగా విస్తృత



పరచాలన్నారు. శివసేవకుల స్వచ్ఛందసేవలను వినియోగించుకోవడం వలన భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించే వీలు కలుగుతుందన్నారు. ఆలయంలో క్యూలైన్ల నిర్వహణ, క్యూకాంప్లెక్సులో దర్శనం కోసం వేచి వున్న భక్తులకు మంచినీటి సరఫరా, అల్పాహార అందజేయుట, అన్నప్రసాదవితరణ మొదలైన చోట్ల శివసేవకుల సేవను వినియోగించుకోవాలన్నారు. స్వచ్ఛందసేవకు వచ్చే శివసేవకులకు శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుండాలన్నారు.ఇంకా వారు మాట్లాడుతూ దేవస్థానంలో ప్రతి ఉద్యోగి కూడా నిబద్ధతతో , అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఉద్యోగులు బాధ్యతాహితంగా విధులు నిర్వర్తిస్తూ జవాబుదారీతనాన్ని పెంపొందించుకోవాలన్నారు. పాలానపరంగా పూర్తి పారదర్శకతను కలిగి ఉండాలన్నారు.భక్తులు ఆన్లైన్ బుకింగ్ సదుపాయాన్ని వినియోగించుకునేవిధంగా ప్రోత్సహించాలన్నారు.అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన మరియు సమీక్షలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీరు శ్రీ జి.వి.ఆర్. శేఖర్, దేవదాయశాఖ స్థపతి శ్రీ పి. పరమేశ్వరప్ప, దేవదాయశాఖ శిల్పవిభాగపు సలహదారు శ్రీ ఎస్. సుందర్‌రాజన్,దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.



# వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం నిర్వహణ పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి







### వార్డెన్ గోపాల్, వాచ్మెన్ రామయ్య ల మీద కఠినమైన చర్యలు తీసుకోవాలి

### అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ కు షో కాజ్ నోటీస్ జారీ

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, డిసెంబర్ 23:-** వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం నిర్వహణ పట్ల జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. వసతి గృహంలో సక్రమంగా భోజనం అందించినందుకు వార్డెన్ గోపాల్, విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిసున్నందుకు వాచ్మెన్ రామయ్య ల మీద కఠినమైన చర్యలు తీసుకోవాలని, పర్యవేక్షణ సక్రమంగా చేయని అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ కు షో కాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి బీసీ సంక్షేమ అధికారిని ఆదేశించారు మంగళవారం కోసిగి మండల కేంద్రంలోని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహ సముదాయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా పిల్లలతో మాట్లాడుతూ భోజనం ఏ విధంగా ఉంటోంది, మెనూ ప్రకారం రోజు ఏ భోజనం అందిస్తున్నారో తెలుసా అని పిల్లలను ఆరా తీశారు..మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, చికెన్ తక్కువ పరిమాణం లో ఇస్తున్నారని, అరటిపండు ఇవ్వడం లేదని, ఆదివారం రోజు టిఫిన్ చాలా ఆలస్యంగా పెడతారని, బాత్రూమ్ లు శుభ్రంగా ఉండవని, లైట్, ఫ్యాన్ లు సరిగా పని చేయవని, డార్మిటరి డోర్ లు, విండో లు ఊడిపోయే స్థితిలో ఉన్నాయని, వాచ్మెన్ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు..కలెక్టర్ డార్మిటరీ ని పరిశీలిస్తూ లైట్, ఫ్యాన్ లు సరిగా పని చేయడం లేదని గమనించారు. అలాగే డార్మిటరి డోర్ లు, విండో లు ఊడిపోయే స్థితిలో ఉన్నట్లు, టాయిలెట్ లు అశుభ్రంగా, దుర్వాసన వస్తున్నట్లు గమనించి, బీసీ సంక్షేమ శాఖ అధికారి తో ఫోన్ లో మాట్లాడి, రేపు వచ్చి వాటిని వెరిఫై చేసి వారం రోజుల్లో మరమ్మతులు చేయించి తనకు ఫోటో లను పంపించాలని కలెక్టర్ బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు..అనంతరం కలెక్టర్ వంట గదిని పరిశీలిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఎందుకు భోజనం అందించడం లేదని, ఇదే స్థానంలో మీ పిల్లలు ఉంటే ఇదే విధంగా చేస్తారా? పిల్లలకి ఇచ్చే పాలలో నీటిని అధికంగా కలిపి ఇస్తారా, చికెన్ కొంచెమే పెట్టడం ఏంటని, అరటిపండు ఎందుకు ఇవ్వడం లేదని కలెక్టర్ వంట సిబ్బంది పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు... సంబంధిత వంట సిబ్బందిని వెంటనే మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఫోన్ ద్వారా బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు...నిర్లక్ష్యానికి బాధ్యులైన వార్డెన్ గోపాల్ ను రీప్లేస్ చేసి అతని మీద కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని, పిల్లలతో దురుసుగా ప్రవర్తిసున్న వాచ్ మెన్ రామయ్య ను టెర్మినేట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అదే విధంగా పర్యవేక్షణలో విఫలమైన అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ అధికారికి షో కాజ్ నోటీస్ లు జారీ చేయాలని కలెక్టర్ మొబైల్ ఫోన్ ద్వారా బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు..

వసతి గృహం వెనుక వైపు డ్రైనేజ్ వాటర్ నిల్వ ఉందని, వెంటనే క్లీన్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి అలసత్వం సహించబోమని, విద్యార్థుల భద్రత, సంక్షేమం పట్ల అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.. లేని యెడల సంబంధిత అధికారులు కఠినమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

కార్యక్రమంలో డీపీఓ భాస్కర్, కోసిగి తహసిల్దార్ వేణుగోపాల్ స్వామి, ఎంపిడిఓ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు..







## గృహ నిర్మాణాలలో వేగం పెంచాలి..

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి..

**కోసిగి, డిసెంబర్ - 23 (పల్లెవెలుగు):** ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ పథకాలను వేగవంతంగా అమలు చేసి, ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కోసిగి మండలంలోని నేల కోసిగి గ్రామంలో ఏర్పాటు చేసిన హౌసింగ్ లేఅవుట్‌ను కలెక్టర్ క పరిశీలించి, గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులను గురించి వివరంగా తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 71 గృహాలు మంజూరు కాగా, వాటిలో 59 గృహాలు బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయని, 3 గృహాలు రూఫ్ లెవెల్‌లో ఉండగా, 5 గృహాలు ఆర్‌సి స్థాయిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన గృహాల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులో పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హౌసింగ్ కాలనీలో లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా వీధి దీపాల ఏర్పాటు, రహదారులు, తాగునీరు, డ్రెయినేజ్ వంటి ప్రాథమిక సదుపాయాలను సమయానుకూలంగా పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. తదనంతరం ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసుకున్న లబ్ధిదారుడు బసన్న గౌడ్ గృహాన్ని కలెక్టర్ సందర్శించి, నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ సహకారంతో సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారుడు తెలియజేయగా, కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చిరంజీవి, డిపిఓ భాస్కర్ , తాసిల్దార్ వేణుగోపాల్ శర్మ, ఎంపీడీవో మహబూబ్ భాషా, హౌసింగ్ డిప్యూటీ ఇంజినీర్ లాల్ స్వామి, ఏ.ఈ స్వరూప్, గ్రామీణ నీటి పారుదల శాఖ తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.






## జిల్లాను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలి.

### పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో వివిధ పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా జిల్లా పర్యాటక అభివృద్ధి మండలి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా 24 పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. జిల్లాలో చాలెంజ్ బేస్ డేస్టినేషన్ కింద అహోబిలంలో రూ.25 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యాటక ప్రాంతాలు, వాటి యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెలవు దినాలలో విద్యార్థులు పర్యాటక ప్రాంతాలను సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈఓ కు సూచించారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం వల్ల ఆనందంతో పాటు విజ్ఞానాన్ని కూడా పొందవచ్చునన్నారు.

అహోబిలం, శ్రీశైలం, మహానంది, బెలూన్ కేవ్స్ లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని

అక్కడ నీటి వసతికి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే సిసి కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచి యాత్రికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటికి తీసుకున్న చర్యలు, ఇంకను చేపట్టాల్సిన పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా టూరిజం అధికారి, డీఈవో జనార్దన్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కురువలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

### టీడీపీ యువ నేత మంజునాథ్ గౌడ్



**హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 23**

కురువలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి యువనేత మంజునాథ్ గౌడ్ అన్నారు. అనంతరం మంజునాథ్ గౌడ్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో రాజకీయం ప్రభావితం చెయ్యగలగిన స్థాయిలో ఆరు లక్షల మంది కురువ కులస్తులు ఓటర్లుగా కలిగి ఉన్నామని,అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మంది కురువ కులస్తులు ఓటర్లుగా కలిగి ఉన్నామని అన్నారు. కానీ మా కురువ కులస్తులకి జిల్లాలో ఎటువంటి నామినేటెడ్ పోస్టులో ప్రాధాన్యత కేటాయించలేదని , మొన్న కూటమి ప్రభుత్వం 25 జిల్లాలకు పార్లమెంట్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను టీడీపీ అధిష్టానం ప్రకటించింది, కానీ అందులో ఒక్కరి కూడా కురువ కులస్తులు లేదని,నాటి నుంచి నేటి వరకు చూసుకుంటే కురువ కులస్తులకు ఒక ఓటు వేసే యంత్రంలా ఉపయోగించుకుంటున్నారు, తప్ప ఒక మనిషిలా కూడా చూడటం లేదని మంజునాథ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కురువలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే కురువలుఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, అభివృద్ధి సాధించగలమని అన్నారు. ఆలూరు తాలూకాలో ఒకటే 65,000 మంది కురువ కులస్తులు ఓటర్లుగా కలిగి ఉన్నామని దానిని టీడీపీ అధిష్టానం దృష్టిలో పెట్టుకొని రేపు జరగబోయే గ్రామపంచాయతీ సర్పంచ్ ఎలక్షన్లో, కాని ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో కురువలకు అత్యధికంగా ప్రాధాన్యత, స్థానాలను కేటాయించాలని టిడిపి అధిష్టానానికి మంజునాథ్ గౌడ్ డిమాండ్ చేశారు.

# మాదకద్రవ్యాలపై నందికొట్కూరు,ఆళ్లగడ్డ పట్టణంలో అవగాహన సదస్సులు మరియు ర్యాలీలు నిర్వహించిన పోలీసులు..






## డ్రగ్స్ పై ఫిర్యాదు చేయుటకు 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయండి.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.

నంద్యాల జిల్లాలో డ్రగ్స్ మరియు గంజాయి,నిషేదిత మాదకద్రవ్యాలపై పజలకు అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు నందికొట్కూరు, ఆళ్లగడ్డ పట్టణంలో అవగాహన సదస్సులు మరియు ర్యాలీ నిర్వహిస్తు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ఆయా పట్టణంలో గల పాఠశాలలు మరియు కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 1,500 మంది విద్యార్థులు నందికొట్కూరు పటేల్ సెంటర్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా “డ్రగ్ వద్దు బ్రో” అనే నినాదాలతో మరియు మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలను ఈగల్ ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు, అనంతరం పటేల్ సెంటర్ వద్ద విద్యార్థులతో మరియు పుర ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించడం జరిగింది.

ఆళ్లగడ్డ పట్టణ కేంద్రంలోని కె.వి సుబ్బారెడ్డి కళాశాల నందు ఆళ్లగడ్డ టౌన్ ఇన్స్పెక్టర్ యుగంధర్ బాబు గారి ఆధ్వర్యంలో డ్రగ్స్ మరియు గంజాయి వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి విద్యార్థులలో అవగాహన కల్పించడం జరిగింది.

ఈ సంధర్భంగా పోలీసు అదికారులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని, సామాజిక–మానసిక–శారీరక సమస్యలు తెచ్చిపెడతాయని తెలియజేశారు.


మాదకద్రవ్యాల నివారణకు పోలీస్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈగల్ టీం ఏర్పాటు చేయడమైనది, ఈ బృందం డ్రగ్ ముఠాలకు వ్యతిరేకంగా నిరంతరం నిఘా కొనసాగిస్తుందన్నారు.మీ పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచనలు ఇవ్వడం జరిగింది.

మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రజల సహకారం కూడా అవసరమని ఏదైనా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్ అధికారులకు గానీ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని మీ వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలియజేశారు.

నందికొట్కూరు నందు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ , ఎమ్మెల్యే జయసూర్య గారు, మున్సిపల్ కమిషనర్ బేబీ, నందికొట్కూరు టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం మరియు ఎసై లు , పోలీసు సిబ్బంది, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ హనుమన్న, జిల్లా మరియు స్థానిక అధికారులు మరియు అన్ని పాఠశాలలు, కళాశాలల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ ఉన్న ఫార్మ్స్ ను వేగవంతంగా పరిష్కరిస్తున్నాం.

## అస్పష్టమైన చిత్రాలు, ఫోటో మిస్మ్యాచ్ లాంటి వాటిని జనవరి 10 లోపు పూర్తి చేస్తాం. జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

పెండింగ్ ఉన్న ఫార్మ్స్ ను వేగవంతంగా పరిష్కరించి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బిఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ఎ.ప్రదీప్, సిపిఐ పార్టీ ప్రతినిధి పి.నరసింహులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి ఎ. నరేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి సాయిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ పెండింగ్ ఉన్న ఫార్మ్స్ 6, 7, 8 లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఓటర్ల జాబితాలో అస్పష్టమైన ఫోటోలు, ఒకరి ఫోటోకు బదులు మరొకరి ఫోటోలు, మనుషులు లేని ఫోటోలను జనవరి 10వ తేదీ లోపు సవరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించడం జరిగిందని, సదరు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని, ఎలక్ట్రోల్ ఓటర్ మ్యాపింగ్ ను కూడా పూర్తి చేస్తున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ వివరించారు. అదేవిధంగా “బుక్ ఏ కాల్ బిఎల్ఓ” కార్యక్రమం ద్వారా ఓటర్లకు ఎటువంటి సమస్య ఉన్న పబ్లిక్ గ్రీవెన్స్ పోర్టల్ లో నమోదు చేసినట్లయితే నేరుగా బిఎల్ఓలు సదరు నంబర్కు ఫోన్ చేసి వారి సమస్యను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలిపారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికలలో ఈవీఎం మిషిన్లకు బదులుగా బ్యాలెట్ పేపర్లను ఏర్పాటు చేయాలని, బిఎల్ఓలు ఫీల్డ్ విజిట్ క్షుణ్ణంగా జరిపేలా చూడాలని రాజకీయ పార్టీ ప్రతినిధులు డిఆర్ఓకు నివేదించారు.





# 50 సార్లు రక్తదానం చేసిన కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందనలు

## రక్తదానం ప్రాణదానంతో సమానం: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
## ఆదర్శంగా నిలిచిన కానిస్టేబుల్ చిన్న సుంకన్నకు ఘన సన్మానం

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో

రక్తదానం చేయడం అంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పేర్కొన్నారు. కర్నూలు టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, ఇప్పటివరకు 50 సార్లు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడిన చిన్న సుంకన్నను ఎస్పీ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ కానిస్టేబుల్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తూనే, సేవాభావంతో రక్తదానం చేయడం అభినందనీయమన్నారు.

**అత్యవసర సమయాల్లో అండగా..**

2011 బ్యాచ్‌కు చెందిన చిన్న సుంకన్న సొంత ఊరు కర్నూలులోని బుధవారపేట. ఈయన జిల్లాలోనే కాకుండా పక్క జిల్లాల నుండి వచ్చే పోలీసులకు, ప్రజలకు, గర్భవతులకు అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైనప్పుడు తక్షణమే స్పందించి ప్రాణదాతగా నిలుస్తున్నారు. తాను రక్తదానం చేయడమే కాకుండా, మరెంతో మందిని రక్తదాతలుగా ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎస్పీ కొనియాడారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, టు టౌన్ సిఐ నాగరాజా రావు తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 23: బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామానికి చెందిన జే రెడ్డి అశోక్ కుమార్ రెడ్డి(38) అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో బయటకు వెళ్తున్నానని తల్లికి చెప్పి వచ్చాడని తెలుస్తోంది. గ్రామంలోని ఖాదర్ వలీ స్వామి దర్గా సమీపంలో రాత్రి మద్యం లో పురుగుల మందు కలుపుకొని తాగి అక్కడే ఉన్న నది వద్ద పడిపోయే మృతి చెందాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అశోక్ రెడ్డి తనకున్న 5 ఎకరాల భూమితో పాటు ఈర్నపాడు గ్రామానికి చెందిన పిట్ట మౌలాలి రెడ్డి కి సంబంధించిన 20 ఎకరాల పొలాన్ని కూడా కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడని తెలుస్తోంది. గత ఏడాది సరైన పంట దిగుబడి రాకపోవడంతో భారీగా అప్పులపాలై ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపానికి గురై మద్యానికి బానిస అయ్యాడు. పేరుకుపోయిన అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలో కలిగిన అప్పులు తీర్చలేక ప్రాణాలు తీసుకోవాలని ఉద్దేశంతో తన కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి మహేశ్వరమ్మ ఫిర్యాదు చేసిందని ఎస్ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. అతని మరణానికి చాలా కారణాలేవి లేవని మహేశ్వరమ్మ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# పేదల గూడు చెరిపితే ఖబడ్దార్..!

**రెవెన్యూ నోటీసులపై 'ఎర్రజెండా' గర్జన.. కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి! బడా బాబుల ఆక్రమణలు కనిపించవా? అధికారులది కళ్లుండి చూడలేని గుడ్డితనమా? వందల మంది నిరుపేదలతో సిపిఎం భారీ ధర్నా – దిగివచ్చిన అధికార యంత్రాంగం.**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో

పేదవాడి సొంతింటి కలపై రెవెన్యూ అధికారులు చావుదెబ్బ కొట్టాలని చూస్తే సహించేది లేదని, అక్రమ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని స్తంభింపజేస్తామని సిపిఎం జిల్లా నాయకత్వం హెచ్చరించింది. హంద్రీ పరివాహక ప్రాంతంలోని పేదల ఇళ్లను ఖాళీ చేయాలంటూ అధికారులు జారీ చేసిన నోటీసులపై మంగళవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిప్పులు చెరిగే నిరసన వ్యక్తమైంది.

అధికారుల తీరుపై నిప్పులు చెరిగిన నేతలు:

సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, న్యూసిటీ కార్యదర్శి టీ.రాముడు మాట్లాడుతూ అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ముజాఫర్ నగర్, సుందరయ్య నగర్ వంటి ప్రాంతాల్లో 40 ఏళ్లుగా నివసిస్తున్న పేదలు మీకు ఆక్రమణదారులుగా కనిపిస్తున్నారా? పొజిషన్ సర్టిఫికెట్లు ఉండి, మున్సిపల్ పన్నులు కడుతున్న ఇళ్లను కూల్చడానికి మీకెక్కడి ధైర్యం?" అని నిలదీశారు. నదిని అడ్డంగా నరికేసి, గోడలు కట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న రాజకీయ పలుకుబడి ఉన్న బడా బాబుల జోలికి వెళ్లడానికి అధికారుల కాళ్లు ఎందుకు వణుకుతున్నాయని ఎద్దేవా చేశారు. పేదలపై ప్రతాపం చూపడం సిగ్గుచేటని మండిపడ్డారు.

ఉద్యమ సెగతో దిగివచ్చిన తహసీల్దార్:

పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, బాధితుల ఆగ్రహంతో కార్యాలయ పరిసరాలు అట్టుడికాయి. అధికారుల తీరుకు వ్యతిరేకంగా మిన్నంటిన నినాదాలతో తహసీల్దార్ కార్యాలయం దద్దరిల్లింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తహసీల్దార్ ఆంజనేయులు బయటకు వచ్చి బాధితుల నుండి వినతిపత్రం స్వీకరించారు. ఇరిగేషన్ అధికారుల ఒత్తిడి వల్లే నోటీసులు ఇచ్చామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నాయకులు శాంతించారు.

పోరాటం ఆగదు..:

నోటీసులు రద్దు చేసే వరకు విశ్రమించేది లేదని, అవసరమైతే నగరవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం నేతలు కె.సుధాకరప్ప, ఎం.సి.ఆనంద్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మరియు వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

# కించపరిచే పథకాలను రద్దు చేయాలి..



కోసిగి, డిసెంబర్ – 23 (పల్లెవెలుగు):

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ మరియు మిషన్ అజీవిక గ్రామీణ్" అనే కొత్త బిల్లు ను తెచ్చి దేశ స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటాలు చేసినటువంటి గాంధీని కించపరిచే విధంగా ఉన్న పథకాలను రద్దు చేసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఆర్ఐ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్ సిపిఐ మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు అన్యాయం చేస్తూ, రాష్ట్రాలపై భారం పడే విదంగా చర్యలకు పూనుకోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకొని ఉపాధి కూలీలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంపై తీవ్రమైన దాడి మొదలైంది. పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీని ఎలా నిర్వీర్యం చేయాలో మోడీ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. యూపీఏ ప్రభుత్వంలో తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేసి, వి బి.జి-రామ్ జి అనే కొత్త బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ఈ కొత్త బిల్లు వలన ఉపాధి హామీ కూలీలకు ఒరిగేది ఏమి ఉండదు. వేతనాలు పెరుగుదల, పని దినాల పెంపు సవ్యంగా లేకపోవడం, సగటు వేతనం 240 రూపాయలకి తగ్గించడం జరిగింది. గత యూపీఏ ప్రభుత్వంలో చట్టం తెచ్చినప్పుడు కేంద్రం 90 శాతం నిధులు, రాష్ట్రాలు 10% నిధులు ఉపాధి హామీకి కేటాయించాలని నిర్ణయిస్తే, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం రాష్ట్రాల మీద భారం పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. వేతనాలు కూడా ఇంతకు మునుపు వస్తున్న 260 రూపాయలు సగటు వేతనం కాకుండా, 240 రూపాయలు సగటున వచ్చే విధంగా కేంద్రం కుట్రలు పన్నుతున్నది. చట్టాన్ని ప్రజల ముందు బయట పెట్టకుండా, ప్రజలు, మేధావులు, పౌర సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోకుండా ఆమోదం పొందింది. గత యూపీఏ ప్రభుత్వం చట్టం తెచ్చే ముందు దేశంలో అందరి అభిప్రాయాలు తీసుకున్నది. నరేంద్ర మోడీ ప్రభుత్వం పేదల పట్ల నియంతృత్వ ధోరణి కనపరిచారు. ఆ విధమైన అభిప్రాయాలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే పనిలో లేనట్లు కనపడుతున్నది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేస్తున్న మోసాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గట్టిగా అడగాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు మా దగ్గర డబ్బులు లేవని బీద అరుపులు అరుస్తున్నప్పుడు, కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఎలా భరిస్తారు.ప్రతి సంవత్సరం రాష్ట్రము లో ఉపాధి హామీకి బడ్జెట్ 10 వేల కోట్లు అవసరం ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు తాయన్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఓంకార స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ సిపిఐ నాయకులు హనుమంతు సిద్దన్న ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.





# కోటావీధి రస్తాను విస్తరణ పనులు చేయండి...

హొళగుంద పల్లె వెలుగు డిసెంబర్ 23

హొళగుంద బస్టాండ్ నుండి కోట వీధికి వెళ్లే రాస్తా ఇరుకుగా ఉందని,ఆ రాస్తాను విస్తరణ పనులను వెంటనే చేయాలని గడియ రుద్ర గౌడ్ కోరారు. అనంతరం రుద్ర గౌడ్ మాట్లాడుతూ ఇరుకు ఉన్న రోడ్డు మార్గంలో అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేయడంతో అటు ఇటుగా రాకపోకలకు చాలా అంతరాయం కలుగుతుంది. ఈ విషయం గురించి గతంలో అధికారులకు తెలిపిన ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇరుకుగా ఉన్న కోటా వీధి రస్తాను వెంటనే విస్తరణ పనులు చేపట్టి వెడల్పుగా చేయాలని అధికారులను కోరారు.

# క్రిస్మస్ మనకు ప్రేమ, శాంతి మార్గాన్ని చూపే మహాపండుగ

**క్రీస్తు బోధనలు సమాజానికి శాశ్వత మార్గదర్శకాలు : జనసేన మండల నాయకుడు శీలంశెట్టి లక్ష్మయ్య**



పోరుమామిళ్ల డిసెంబర్ 23 ( పల్లె వెలుగు)

క్రైస్తవ లోకానికి అత్యంత పవిత్రమైన పండుగ అయిన క్రిస్మస్ పండుగ సందర్భంగా జనసేన మండల నాయకుడు శీలంశెట్టి లక్ష్మయ్య గారు భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు ప్రభువు జీవితం, బోధనలు మానవాళికి ఇచ్చిన సందేశాన్ని వివరించారు.

క్రీస్తు ప్రభువు జన్మ ప్రేమ, క్షమ, త్యాగానికి ప్రతీకగా నిలిచిందని ఆయన అన్నారు. పేదలు, అణగారిన వర్గాల పక్షాన నిలబడి సమానత్వాన్ని బోధించిన క్రీస్తు జీవితం నేటి సమాజానికి ఆదర్శమని తెలిపారు.

క్రీస్తు బోధనలు మత పరిమితులకు అతీతంగా మానవ విలువలను పెంపొందించేవిగా ఉన్నాయని లక్ష్మయ్య గారు పేర్కొన్నారు. ద్వేషం, హింసకు చోటులేని సమాజాన్ని నిర్మించాలన్న సందేశం క్రిస్మస్ ద్వారా మరింత స్పష్టంగా వెలువడుతుందని అన్నారు.ఈ పండుగ సందర్భంగా భక్తులు ప్రార్థనలతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం శుభపరిణామమని, అవసరమైన వారికి సహాయం చేయడమే క్రీస్తుకు నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు.అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో మెలిగి, శాంతియుత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ, క్రిస్మస్ పండుగ ప్రతి ఇంటికి ఆనందం, ఆశ, శాంతిని తీసుకురావాలని లక్ష్మయ్య గారు ఆకాంక్షించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com